ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 30 ఏప్రిల్ 2025



తహసీల్దార్ల మెడకు ఫ్రీహోల్డ్ ఉచ్చు

- ఇప్పటికే నలుగురు తహసీల్దార్లకు నోటీసులు
- మిగిలిన వారికి నేడో..? రేపో? ● అధికారులపై చర్యలు సరే..
- అక్రమాలకు ఒత్తిడి చేసిన నాయకులపై చర్యలేంటో...?





జిల్లాలోని పలువురు తహసీల్దార్ల మెడకు ఫ్రీహోల్డ్ ఉచ్చు బిగుసుకుంటోంది. ఫ్రీహోల్డ్ ఫైళ్లలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఇప్పటికే నలుగురు తహసీల్దార్లకు ఉన్నతాధికారులు నోటీసులు ఇచ్చారు. నేడో..? రేపో? జిల్లాలో మరికొందరు తహసీల్దార్లకు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అధికారులపై చర్యల కోసం నోటీసులు ఇచ్చారు సరే.. అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెచ్చి.. అక్రమాలు చేయించిన వైసీపీ నాయకులపై ఎటువంటి చర్యలు ఉంటాయి? ఎప్పుడు ఉంటాయనే ప్రశ్నలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం 2023లో ఫ్రీహోల్డ్ పేరుతో డీకేటీ భూములపై లబ్ధిదారులకు యాజమాన్య హక్కులను కల్పించేందుకు ఫ్రీహోల్డ్ చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టం ప్రకారం 20 సంవత్సరాలు తమ అనుభవంలో ఉన్న భూములకు యాజమాన్య హక్కులు కల్పించింది. ఇందుకు అనేక నిబంధనలు పెట్టింది. అయితే జిల్లాలో పలువురు వైసీపీ నాయకులు ఈ నిబంధనలతో పనిలేకుండా తహసీల్దార్లపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. జగనన్న కలలు కన్నట్టు మరో 30 సంవత్సరాలు వైసీపీనే అధికారంలో ఉంటుందని అనుకున్నారు. దీంతో అడ్డదిడ్డంగా చెరువులు, గుట్టలు, వాగులు, వంకలను సైతం ఫ్రీహోల్డ్ పేరుతో దర్జాగా ఆక్రమించుకున్నారు. అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసుకోవడంతో పాటు వేలాది ఎకరాలను రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. ఆ పాపాలు ఎప్పటికీ బయటపడవని అనుకున్నారు. అయితే వీళ్ల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఫ్రీహోల్డ్ అక్రమాలను వెలికితెచ్చేందుకు నిర్ణయించుకుని ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లను నిలిపేసింది. ఇప్పటి వరకు జరిగిన ఫ్రీహోల్డ్ ఫైళ్లపై పునర్విచారణను చేపట్టింది. ఈ సందర్భంగా అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలోని 30 మండలాల్లో ఈ అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఇందుకు బాధ్యులైన అధికారులనూ గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫ్రీహోల్డ్ ఫైళ్లలో అక్రమాలు జరిగిన టాప్-10 మండలాల్లో జిల్లాకు చెందిన 4 మండలాలు ఉండడం విశేషం.

జిల్లాలో 70 శాతానికి పైగా అక్రమాలే

జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో ఫ్రీహోల్డ్ ఫైళ్లను పరిశీలిస్తే సుమారు 70 శాతానికి పైగా అక్రమాలే జరిగాయి. జిల్లాలో మొత్తం 30 మండలాలకు గానూ 153154.8 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఇందులో 92249.4 ఎకరాలు అక్రమంగా చేశారు. రాజంపేట నియోజకవర్గంలో 16,497 ఎకరాలకు గానూ 8460.5 ఎకరాలు అక్రమంగా, రైల్వేకోడూరు నియోజకవర్గంలో 13,674.07 ఎకరాలకు గానూ 7913.03 ఎకరాలు అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారు. రాయచోటి నియోజకవర్గంలో 31,856.64 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేయగా.. అందులో 19,172.68 ఎకరాలు అక్రమంగా చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 36,104.7 ఎకరాలు జరగ్గా 18,466.3 ఎకరాలను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారు. పీలేరు నియోజకవర్గంలో 48473.3 ఎకరాలకు గానూ 35,539.26 ఎకరాలు అక్రమంగా చేశారు. మదనపల్లె నియోజకవర్గంలో 6548.1 ఎకరాలకు గానూ 2697.4 ఎకరాలు అక్రమంగా చేశారు.

నాలుగు మండలాలు ఇవే..

రాష్ట్రవ్యాప్తంగా ఫ్రీహోల్డ్‌లో అక్రమాలు జరిగిన టాప్-10 మండలాల్లో జిల్లాలోని నందలూరు, వీరబల్లి, రామాపురం, గుర్రంకొండ మండలాలకు స్థానం దక్కింది. నందలూరులో 1352.18 ఎకరాలకు గానూ.. 1128.57 ఎకరాలు అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారు. వీరబల్లి మండలంలో 4755.88 ఎకరాలకు గానూ.. 2199.5 ఎకరాలను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారు. రామాపురం మండలంలో 5124 ఎకరాలకు గానూ.. 2675.8 ఎకరాలు అక్రమంగా చేశారు. గుర్రంకొండ మండలంలో 8782.16 ఎకరాలకు గానూ.. 6252.54 ఎకరాలు అక్రమంగా చేశారు.

నాయకుల సంగతేంటి...?

ఫ్రీహోల్డ్ ఫైళ్లలో అక్రమాలకు పాల్పడిన ఆరోపణలపై జిల్లా అధికారులు గతంలో నందలూరు, వీరబల్లి, రామాపురం, గుర్రంకొండ మండలాల తహసీల్దార్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. నేడో..? రేపో ఇంకా పలువురు తహసీల్దార్లకు కూడా నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం. అదే సమయంలో అధికారులపై ఒత్తిళ్లు చేసిన వైసీపీ నాయకులపైన ఎటువంటి చర్యలు తీసుకుంటారు? ఎప్పుడు తీసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో నాయకులు అధికారులను స్వేచ్ఛగా ఉద్యోగం చేసుకోనీయలేదనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలతో పని లేకుండా తాము చెప్పినట్లు వినాల్సిందే అనే ధోరణితోనే.. వైసీపీ నాయకులు వ్యవహరించిన విషయం రాష్ట్రమంతా చూసిన సంగతి తెలిసిందే. వీరబల్లి మండలం వీరబల్లి గ్రామంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భార్య స్వర్ణలత పేరుతో సర్వే నెంబరు 2139లో చెరువును ఫ్రీహోల్డ్ చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో స్పష్టంగా చెరువు అని ఉన్నప్పటికీ ఫ్రీహోల్డ్ చేయడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా ఏ స్థాయిలో అక్రమాలు జరిగి ఉంటాయో? ఇట్లే అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో తమ అక్రమాల కోసం అధికారులపై ఒత్తిళ్లు చేసిన వైసీపీ నాయకులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


పట్టాదారుని అడంగలు

District : అన్నమయ్య-Annamayya (24) Mandal : వీరబల్లి (19) Village : వీరబల్లి(2419005) Extent Units : Acres/cents Fasli : 1434 Year : 2024

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15
1	2139	5.0000	0.0000	5.0000	Assigned Land Made Freehold in 2023	0.00	చెరువు	[illegible]	5.0000	1383 536260870971	పెద్దిరెడ్డి స్వర్ణలత (రామచంద్రారెడ్డి)	పెద్దిరెడ్డి స్వర్ణలత (రామచంద్రారెడ్డి)	5.0000	Assigned Land Made Freehold in 2023

వీరబల్లిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భార్య పేరుతో చెరువును ఆన్‌లైన్ చేసిన దృశ్యం

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి : కలెక్టర్


మహిళా ఉద్యోగులతో కలిసి షీ బాక్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో ఏర్పడే సమస్యలను మహిళా ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో అమరావతి ఏపీ జేఏసీ జిల్లా శాఖ ఏర్పాటు చేసిన షీ బాక్స్‌ను మహిళా ఉద్యోగులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సమస్యలపై షీ బాక్స్‌ను ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. ప్రధానంగా మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న ప్రదేశంలో ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను బయట చెప్పడానికి లేదా లైంగిక వేధింపుల అంశాల్లో తమ పేర్లు బయట పెట్టడానికి చాలా మంది ఇష్టపడటం లేదని అటువంటి వారు షీబాక్స్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. వాస్తవిక సమాచారం ఆధారాలతో తమ దృష్టికి వచ్చిన ఏ సమస్యనైనా తప్పకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ ఒక మహిళ ఉద్యోగికి ఏదైనా సమస్య వస్తే తోటి మహిళా ఉద్యోగులు అండగా ఉండాలని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే దిశగా అవగాహన పెంచాలన్నారు. అమరావతి ఏపీజేఏసీ జిల్లా చైర్మన్, రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, జనరల్ సెక్రటరీ వైష్ణవి మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అంగీకారంతో ఏపీజేఏసీ షీ బాక్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఏపీ జేఏసీ మహిళా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణయత్నం

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


ఆక్రమణదారులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

కురబలకోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై జాతీయ రహదారికి కొద్ది దూరంలో ఉన్న విలువైన భూమిని కొంత మంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నించగా వారిని అడ్డుకుని ఆ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 1867-1లో 5.02 ఎకరాల డీకేటీ భూమి ఉంది. ఈ భూమిని 2022లో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ఈ భూమిని చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన కొంతమంది ఆక్రమించుకుని వ్యవసాయం చేస్తున్నారు. తాజాగా మదనపల్లెకు చెందిన కొంతమంది ఆ భూమిని కొనుగోలు చేశామని, కోర్టు కూడా తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని చెబుతూ ఫెన్సింగ్ వేస్తుండగా ఈ సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని అడ్డుకోవడానికి ప్రయత్నించగా ఆక్రమణదారులు వాగ్వాదానికి దిగారు. పోలీసుల సాయంతో అధికారులు ఆ భూమిలో నాటిన రాళ్లను తొలగించారు. కాగా ఆ భూమిలో సాగు చేసిన పంటను కూడా తొలగిస్తామని రెవెన్యూ అధికారులు తెలియజేశారు.

రేపటి నుంచి ఒకే గ్రామీణ బ్యాంకు

- రాష్ట్రమంతా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు పేరుతో విలీనం
- కడప ఆంధ్ర ప్రగతి గ్రామీణ, చిత్తూరు సప్తగిరి గ్రామీణ బ్యాంకుల కనుమరుగు
- స్పాన్సర్డ్ బ్యాంక్‌గా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా




కొత్తగా ఏర్పాటు కానున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు

కలికిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో ప్రస్తుతం ఉన్న గ్రామీణ బ్యాంకులు కనుమరుగు కానున్నాయి. గురువారం నుంచి రాష్ట్రమంతా ఒకే గ్రామీణ బ్యాంకు ఏర్పాటవుతోంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న నాలుగు గ్రామీణ బ్యాంకులన్నింటినీ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు పేరుతో విలీనం చేస్తున్నారు. అమరావతి కేంద్రంగా ఇక నుంచి ఏపీ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం పనిచేస్తుంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పాన్సర్ చేయనుంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (కడప కేంద్రంగా), చైతన్య గోదావరి (గుంటూరు), ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (వరంగల్), సప్తగిరి గ్రామీణ బ్యాంకు (చిత్తూరు)లో ఉన్నాయి. ఒకే రాష్ట్రం.. ఒకే బ్యాంకు అన్న నినాదం కింద ఈ నాలుగు గ్రామీణ బ్యాంకులను విలీనం చేస్తున్నారు. వరంగల్ బ్యాంకు ఇది వరకే పూర్తిగా తెలంగాణా గ్రామీణ బ్యాంకులో విలీనమైంది. ఈ బ్యాంకు పరిధిలో ఏపీలోని వివిధ జిల్లాల్లోని బ్రాంచ్‌లన్నీ తాజాగా ఏపీ గ్రామీణ బ్యాంకులో విలీనం కానున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి కడప జిల్లాలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) నడుస్తోంది. కెనరా బ్యాంకు దీనిని స్పాన్సర్ చేస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు (ఎస్‌జీబీ) సేవలందిస్తోంది. ఇది ఇండియన్ బ్యాంకుకు అనుబంధంగా ఉంది. ఏపీజీబీకి ప్రధాన కార్యాలయం కడపలో ఉంది. ఎస్‌జీబీకి చిత్తూరులో ఉంది. కడప ఏపీజీబీ ప్రస్తుతం 551 బ్రాంచ్‌లతో రాష్ట్రంలోనే అతి పెద్ద గ్రామీణ బ్యాంకుగా ఉంది. అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఇది విస్తరించింది. ఇక సప్తగిరి గ్రామీణ బ్యాంకు చిత్తూరు ప్రధాన కేంద్రంగా చిత్తూరు, అన్నమయ్య, ఎన్టీఆర్, ఏలూరు, తిరుపతి, కృష్ణా జిల్లాల్లో పనిచేస్తోంది. కడప ఏపీజీబీ 2006 జూన్ 1న ఏర్పాటు కాగా, అంతకు ముందున్న శ్రీవెంకటేశ్వర గ్రామీణ బ్యాంకు పేరు మార్చి సప్తగిరి గ్రామీణ బ్యాంకు పేరుతో 2006 జూలై 1న ఏర్పాటైంది. 19 ఏళ్లుగా గ్రామీణ మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు విశేష సేవలందించడంలో ఈ బ్యాంకులు పూర్తిగా ఫలప్రదమయ్యాయని చెబుతారు. లక్షలాది మంది ఖాతాదారులు, ప్రధానంగా మహిళా సంఘాలకు ఆర్థిక చేయూతనివ్వడంలో ఇవి విశేష సేవలందించాయి. కాగా ప్రస్తుతమున్న నాలుగు గ్రామీణ బ్యాంకులను ఒకే గ్రామీణ బ్యాంకుగా విలీనం చేస్తున్నా ఖాతాదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగవని బ్యాంకింగ్ వర్గాలు పేర్కొన్నాయి. ఖాతా నెంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు, బ్రాంచి చిరునామాల్లో ఎలాంటి మార్పులు ప్రస్తుతానికి ఉండబోవని కూడా పేర్కొన్నారు. ప్రస్తుతమున్న డిపాజిట్ల ఖాతాలు, రుణాలు, ఇతరత్రా సేవలు కూడా యథాతథంగా కొనసాగుతాయని తెలిపారు. ఖాతాదారులు తమ చెక్‌బుక్కులు, పాస్‌పుస్తకాలు, ఏటీఎం కార్డులు, ఇతర డిజిటల్ సేవలను కొనసాగించుకోవచ్చన్నారు.

మహావృక్షానికి నూతన సొబగులు

- హార్సిలీహిల్స్‌లో ఆకట్టుకుంటున్న 166 ఏళ్ల నాటి వృక్షం


లైట్ల వెలుగులో వృక్షం

బి.కొత్తకోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ లోని ఫారెస్ట్ క్యాంపస్‌లో ఉన్న యూకలిప్టస్ వృక్షం నూతనశోభను సంతరించుకుంది. ఏనుగు మల్లమ్మ కొండను గుర్తించి అభివృద్ధి పరచి పర్యాటకకేంద్రంగా మార్చిన డబ్ల్యుహెచ్ హార్సిలీ 1859లో నాటిన ఈ యూకలిప్టస్ (నీలగిరి) వృక్షం 5.3 మీటర్ల చుట్టుకొలత, 55 మీటర్ల ఎత్తు కలిగి మహావృక్ష పురస్కార్‌ను పొందింది. హిల్స్‌కు వచ్చిన పర్యాటకులు ఫారెస్ట్ క్యాంపస్‌లో పర్యటించినపుడు ఈ మహావృక్షాన్ని చూసి దీని గురించి చర్చించుకోవడంతో పాటు అందమైన ఫొటోలు దిగుతుంటారు. తాజాగా అటవీశాఖాధికారులు రూ.1.50 లక్షలతో ఈ వృక్షానికి నూతన సొబగులతో తీర్చిదిద్దారు. చుట్టూ అందమైన పెయింటింగ్, గ్రిల్స్‌తో నిర్మాణంతో పాటు, చెట్టు పైభాగానికి పడేలా ఫోక్సింగ్ లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో రాత్రివేళ ఆ లైట్ల వెలుగులో ఈ వృక్షం చూపరులను ఆకట్టుకుంటోంది. అదేవిధంగా బ్రిటీష్ కాలం నాటి అతిథిగృహ ముఖద్వారం, ప్రాంగణాన్ని సైతం సుందరీకరించారు.


మహావృక్షం చుట్టూ నూతన నిర్మాణం

విచారణ నామమాత్రమేనా...?

- మూడు నెలలైనా పురోగతి ఏదీ...!
- నిరాదరణకు గురవుతున్న రూ.కోట్ల ఆస్తులు

బి.కొత్తకోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలోని దేవదాయ శాఖకు చెందిన రూ.కోట్ల ఆస్తులకు సంబంధించిన వ్యవహారంలో అదే నిర్లక్ష్యధోరణి, అక్రమాలు, అవకతవకలు కొనసాగుతూనే ఉన్నాయి. అంతులేని ఈ అక్రమాలపై జిల్లా, రాష్ట్ర దేవదాయశాఖ అధికారులకు వెళ్లిన ఫిర్యాదులపై విచారణలు జరిగినప్పటికీ వాటి వల్ల ఒరిగిందేమీ లేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణంలోని చెన్నకేశవాలయం, శివాలయం, ఆంజనేయ ఆలయం, గ్రామదేవత ఆలయాలకు పట్టణ పరిధిలో రూ.కోట్ల విలువ చేసే వ్యవసాయ భూములు, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. బ్యాంకులలో డిపాజిట్లూ ఉన్నాయి. వాటిని సద్వినియోగపరుచుకుంటే పెద్దఎత్తున ఆదాయం సమకూరి, ఆలయాల అభివృద్ధి, సంపద పెంపు సాధ్యమవుతుంది.

దేవదాయ ఆస్తులు... ఆదాయంపై అదే నిర్లక్ష్యం


పట్టణ నడిబొడ్డున ఉన్న గంగమ్మ ఆలయం

మాన్యం భూముల అక్రమాలపై రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు విచారణాధికారిగా కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు జనవరి 30న బి.కొత్తకోటకు వచ్చారు. ఆలేటివాగు పక్కన సర్వే నెంబరు-1840, 1726లలోని మాన్యం భూములలో లీజుదారుడు ఇసుక తరలింపుతో ధ్వంసం అయిన విధానాన్ని, లీజు లేకుండా అనుభవిస్తున్న భూములను, పట్టణ నడిబొడ్డున బెంగళూరు రోడ్డుకు ఆనుకుని ఉన్న గంగమ్మ మాన్యంలో నామమాత్రపు అద్దెలతో వాణిజ్య అవసరాల కోసం వినియోగించుకుంటున్న భూములను, అందులో ఈవో మునిరాజ చేతివాటాన్ని పరిశీలించారు. వీటీఎం రోడ్డులోని అంజనేయ స్వామి మాన్యంలో అక్రమంగా పెట్టుకున్న దుకాణాలను చూసి ఖాళీ చేయాలంటూ ఆదేశాలిచ్చారు. తహసీల్దార్ అజారుద్దీన్‌ను కలిసి ఇసుక తరలించిన మాన్యం భూములను సర్వే చేసి హద్దులు చూపాలని, వెంకటరమణ స్వామి ఖాతాలోకి మారిన చెన్నకేశవస్వామి భూములను తిరిగి మార్చాలని కోరారు. గ్రామదేవత ఆలయానికి సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్ లోని 7 గదులను ఖాళీ చేయించి బహిరంగ వేలం వేసేలా చూస్తామన్నారు. అక్రమాలకు కారకుడైన ఈవో మునిరాజపై శాఖాపరమైన చర్యలుంటాయని, తన విచారణ నివేదికను రాష్ట్ర కమిషనర్‌కు నివేదిస్తానన్నారు. ఇది జరిగి మూడు నెలలైనా చర్యలు మాత్రం శూన్యం.

ఖాళీ చేయించలేని దైన్య స్థితిలో అధికారులు


ఆంజనేయస్వామి మాన్యంలో దుకాణాలు ఖాళీ చేయాలని హెచ్చరిస్తున్న విచారణాధికారి కర్నూలు డీసీ రామాంజనేయులు (ఫైల్)

9.89 ఎకరాల గంగమ్మ మాన్యంలో ఇటుక బట్టీలు, గ్రానైట్ దుకాణం, టమోటా నర్సరీలు ఏళ్ల తరబడి నిర్వహించుకుంటున్నారు. అత్యంత విలువైన ఈ భూమిని ఖాళీ చేయించి 0.50 ఎకరాల బిట్లుగా విభజించి వేలం వేయాల్సి ఉంది. ఆలయం చుట్టుపక్కల వున్న షాపింగ్ రూములను ఖాళీ చేయించిన తర్వాత వేలం పాటలు నిర్వహించాల్సి వుంది. గతంలోనూ ఖాళీ లేని రూములను వేలం నిర్వహించడం వల్ల బాధితులు కోర్టును ఆశ్రయించారు. ఆంజనేయస్వామి మాన్యంలోనూ దుకాణాలు వెలిశాయి. వీటి అద్దెలను ఈవో అనధికారికంగా వసూలు చేసుకుంటున్నట్లు గుర్తించారు. వీటిని ఖాళీ చేయాల్సిందిగా అప్పట్లో డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు, రాయచోటి అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్‌లు నేరుగా వచ్చి ఆదేశించినా ఫలితం లేకుండాపోయింది. ఏ ఒక్క బిట్టును కూడా ఖాళీ చేయించలేని దయనీయస్థితిలో అధికారులు ఉండటంతో ఆలయ సంపద కొరగాకుండా పోతోంది.

నవ్వుల పాలైన వేలం నిర్వహణ

గంగమ్మ ఆలయానికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని 7 రూములు, బెంగళూరు రోడ్డులోని సర్వే నెంబరు-326లోని 2.54 ఎకరాలు, సర్వే నెంబరు-329లో 7.35 ఎకరాల వాణిజ్య భూముల లీజుకు సంబంధించి ఈనెల 10న ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వేలం పాటలో దేవదాయ అధికారులు నవ్వుల పాలయ్యారు. ముందస్తు ప్రచారం, పత్రికా ప్రకటన లేకుండా కొన్నేళ్లుగా భూములు, రూములను అనుభవించుకుంటున్న వారితో పాటు, కొందరికి మాత్రమే పాంప్లెట్లు పంచిపెట్టి వేలానికి పూనుకున్నారు. దీనికి స్థానికుల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తం కావడంతో విధిలేని పరిస్థితిలో వేలం పాటను వాయిదా వేసి వెళ్లాల్సి వచ్చింది.


గ్రామదేవత ఆలయం వద్ద వేలం నిర్వహణకు ప్రయత్నిస్తున్న దేవదాయశాఖ అధికారులు (ఫైల్)

గట్టి చర్యలు తీసుకుంటాం..

బి.కొత్తకోట మాన్యం భూముల విషయంలో చాలా సమస్యలున్నాయి. అక్కడి ఈవో మునిరాజ పనితీరు అలాంటిది. అతని లొసుగులను ఆసరాగా తీసుకుని ఇప్పటికే మాన్యం భూములలో తిష్టవేసిన వారు అదేదో వారి సొంత భూములైనట్లు మాట్లాడుతున్నారు. అంత విలువైన ఆస్తులున్నప్పటికీ ఆయా ఆలయాలకు తగిన ఆదాయం రావడం లేదన్నది వాస్తవం. గడువు ముగియగానే పోలీసుల సాయంతో ఖాళీ చేయిస్తాం. ఏడాదికి కొంచెం పెరిగేలా 11 ఏళ్ల లీజుకు వేలం పాటలు పకడ్బందీగా నిర్వహిస్తాం.

\- విశ్వనాథ్, అసిస్టెంట్ కమిషనర్

ఐస్..యాపిల్



పీలేరు/పీలేరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు ఎర్రటి ఎండలతో ఠారెత్తిస్తున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ, ఉక్కపోత, వడగాల్పులు, చెమట ధారలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. విభిన్న వాతావరణ పరిస్థితులు సృష్టించే ప్రకృతి, వాటిని ఎదుర్కొనే ఉపాయాలనూ బోధిస్తుంది. అలా ఎండల బారి నుంచి తప్పించుకోవడానికి ప్రకృతి తాటిముంజలను ప్రసాదించింది. కేవలం ఎండా కాలంలో మాత్రమే దొరికే ఇవి ఎండ వేడిమి నుంచి కాపాడడమే కాకుండా అనేక ఆరోగ్య గుణాలు కూడా కలిగి ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. చూడడానికి జెల్లీలా, నోటిలో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే వీటి లోపలి భాగంలో నీరు ఉంటుంది. అందువల్ల శరీరానికి చలువ చేస్తుంది. అందుకే వాటిని 'ఐస్ యాపిల్' అని పిలుస్తారు. ఎండా కాలంలో తాటి ముంజలను అధికంగా తీసుకోవడం ద్వారా వడదెబ్బతో పాటు అనేక అనారోగ్య సమస్యల నుంచి తప్పించుకోవచ్చునని వారు తెలిపారు. గత మూడు రోజులుగా ఇవి పీలేరు ప్రాంతంలో పెద్దఎత్తున దొరుకుతున్నాయి. పీలేరు పరిసర ప్రాంతాల్లో తాటి చెట్లు లేకపోయినప్పటికీ పొరుగునే ఉన్న చిత్తూరు జిల్లా ఐరాల, పూతలపట్టు మండలాల్లోని పలు ప్రాంతాల నుంచి పలువురు మహిళలు, వ్యాపారులు వాటిని పీలేరులో విక్రయిస్తున్నారు. డజన్ తాటి ముంజలు రూ.70 నుంచి రూ.100 చొప్పున అమ్ముతున్నామని వారు తెలిపారు.



పీలేరులో తాటిముంజలను విక్రయిస్తున్న వ్యాపారులు

అనేక ఆరోగ్య ప్రయోజనాలు...

● వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి తాటిముంజలు ఎంతగానో ఉపయోగపడతాయి. వాటిలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల వాటిని తింటే అధిక దాహార్తి తగ్గుతుంది. వడదెబ్బ నుంచి తప్పించుకోవచ్చు. శరీర ఉష్ణోగ్రతను అదుపులో పెడతాయి. శరీరం డీహైడ్రేట్ కాకుండా కాపాడుతాయి.

● వీటిలో ఎక్కువ తేమ, తక్కువ కొవ్వు ఉండడంతో అవి త్వరగా జీర్ణమై అసిడిటీ, పొట్ట ఉబ్బరం తగ్గి జీర్ణప్రక్రియను సజావుగా చేస్తాయి. చిన్నారులు, హృద్రోగులు, షుగర్ కలిగిన వారు, అధిక బరువుతో బాధపడే వారికి ఇవి ఎంతగానో మేలు చేస్తాయి.

● తాటిముంజలో ఎక్కువగా ఉండే పొటాషియం బీపీని కంట్రోల్ చేస్తుంది. తద్వారా గుండె జబ్బులను నివారిస్తుంది. అంతేకాకుండా శరీరంలోని హానికర వ్యర్థాలను బయటకు పంపడంతో పొటాషియం ఎంతగానో సహాయపడుతుంది.

● దొరికినంత కాలం తాటిముంజలను క్రమం తప్పకుండా తినడం వల్ల శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. తద్వారా లివర్ సమస్యలను అధిగమించవచ్చు.

● తాటి ముంజలు మహిళలకు ప్రకృతి ప్రసాదించిన వరం లాంటివి. వారిలో ఎక్కువగా కనిపించే రొమ్ము క్యాన్సర్ రాకుండా చూడడంతో తాటిముంజలు అద్భుతంగా పనిచేస్తాయని వైద్యులు చెబుతున్నారు. రొమ్ము క్యాన్సర్ కారక పెట్రో కెమికల్స్, ఆంథోసైనిన్ లాంటి వాటిని నిర్మూలిస్తాయని అనేక అధ్యయనాలు వెల్లడించాయి.

● ఎండ కారణంగా తరుచూ బయట తిరిగే వారిలో కనిపించే వికారం, వాంతులను ముంజలు నివారిస్తాయి. వేసవిలో వచ్చే చికెన్ పాక్స్(అమ్మవారు)ను కూడా నివారించవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

● వేసవిలో ఎక్కువ సమయం ఆరుబయట ఆడుకునే చిన్నారుల్లో కనిపించే దద్దుర్లు వంటి చర్మ సమస్యలను సైతం తాటి ముంజలు తగ్గిస్తాయని వైద్య శాస్త్రం చెబుతోంది. దద్దుర్లపై తాటిముంజలతో మర్దన చేస్తే అవి మాయమైపోతాయి. వీటితోపాటు అధిక బరువు, గర్భిణీ, బాలింత మహిళలు, నెలసరి ఇబ్బందులు వంటి అనేక సమస్యలకు తాటిముంజలు బాగా పనిచేస్తాయని, వాటిని అధికంగా తీసుకోవాలని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు.

ప్రకృతి ప్రసాదించిన వేసవి వరం



వేసవి ఇబ్బందుల నుంచి తప్పించుకునేందుకు ప్రకృతి మనకు ప్రసాదించిన వరం తాటిముంజలు. ఎంఎన్‌సీలకు చెందిన కూల్‌డ్రింక్స్ తాగే బదులు సహజసిద్ధంగా వచ్చే తాటిముంజలను తినడం ఎంతో మేలు. వాటిలో ఉండే ఔషధ గుణాలు తెలుసుకునే మన పూర్వీకులు వాటిని ఎక్కువగా తినమని సూచించారు. అయితే ఆధునికీకరణ పేరుతో మనలో చాలా మంది వాటి వైపు చూడడం లేదు. రోడ్డు పక్కన అతిచవకగా దొరికే ముంజలలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటిని చిన్నచూపు చూడకుండా అవి ఎంత కాలం దొరుకుతాయో అంతకాలం తింటే మంచిది. అప్పుడే మనం ఎండల నుంచి ఉపశమనం పొందగలం.

-డాక్టర్ పవన్‌కుమార్, చిన్నపిల్లల వైద్యుడు, పీలేరు

గంగమ్మతల్లికి బంగారు ఆభరణాలు

● తయారు చేయించి ఇచ్చిన దాతలు, కమిటీ సభ్యులు
● జాతర రోజు అమ్మవారికి ఆభరణాల అలంకరణ



బంగారు కిరీటం, మాంగ చంద్రహారం, సూర్యవంక

రైల్వేకోడూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గంగమ్మతల్లికి దాతలు, కమిటీ సభ్యులు కలిసి బంగారు ఆభరణాలను తయారు చేయించారు. అమ్మవారి జాతర ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమౌతాయి. గురువారం జాతర నిర్వహించి, శుక్రవారం నిమజ్జనంతో జాతర ముగుస్తుంది. గంగమ్మకు మండలంలో చాలా మంది దాతలు బంగారు ఆభరణాలు చేయించడానికి ముందుకు వచ్చారు. లక్షలాది రూపాయల చందాలు వచ్చాయి. దీంతో మొదటిగా ఈ ఏడాది అమ్మవారికి బంగారు కిరీటం, తర్వాత రెండు బంగారు హస్తాలు, సూర్యవంక, మాంగచంద్రహారం, పుష్పహారం తయారు చేయించారు. అదే విధంగా పోతులరాజు విగ్రహాన్ని దాతలు తయారు చేయించి ఇచ్చారు. బుధవారం అర్ధరాత్రి మట్టితో గంగమ్మ ప్రతిమను తయారు చేస్తారు. అనంతరం అమ్మవారికి బంగారు ఆభరణాలను అలంకరిస్తామని జాతర నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి బంగారుతో జడకుచ్చులు తయారు చేయించారు. ప్రస్తుతం జరుగుతున్న జాతర వందేళ్లు పూర్తి కావడంతో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హోటళ్లు, మాంసం దుకాణాల్లో తనిఖీలు



హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు షమీమ్‌బాషా, వెంకటసుబ్బయ్య

మదనపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాంసం దుకాణాలతో పాటు వివిధ హోటళ్లను మంగళవారం ఆహార భద్రత అధికారి కె.షమీమ్‌బాషా, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటసుబ్బయ్య తనిఖీ చేశారు. బెంగ ళూరు బస్టాండు, అంబేడ్కర్ సర్కిల్, ఎన్‌టీ ఆర్ సర్కిల్ ఏరియాలోని వివిధ హోటళ్లతోపాటు దర్నీపేట, నీరుగట్టు వారిపల్లె, బెంగళూరు బస్టాండు, రామా రావుకాలనీ ఏరియాలలో మటన్, చికెన్ దుకాణాలను పరిశీలించారు. ఎక్కువ రోజులు ఫ్రిజ్‌లో ఉంచిన మటన్, చికెన్‌లను ఆహార ప దార్థాలుగా వాడరాదని సూచించారు. వీటిని కస్టమర్లకు పెడితే అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కూరలు, చికెన్, మటన్ వంటకాలకు పదేపదే వాడిన ఆయిల్‌ను ఉపయోగిస్తే జీర్ణకోశ, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వచ్చే అవకాశముందన్నారు. హోటళ్లు, చికెన్, మటన్ షాపులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లైసెన్సులు ఎప్పటికప్పుడు రెన్యువ ల్ చేసుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆహార భద్రతశాఖ సీనియర్ అసిస్టెంట్ పి.సీతారామయ్య, మున్సిపల్ మేస్త్రీ రెడ్డెప్ప, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ విహారయాత్రలో విషాదం

● గంగోత్రి కొలనులో యువకుడి గల్లంతు
● ఆచూకీ కోసం పోలీసుల విఫలయత్నం



గంగోత్రిలో గల్లంతైన బాలు (ఫైల్)

బి.కొత్తకోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో మంగళవారం విషాదకర సంఘటన జరిగింది. ఓ యువకుడు ఘాట్‌రోడ్డులోని గంగోత్రిలో గల్లంతయ్యాడు. సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపిన వివరాల మేరకు. బి.కొత్తకోట పట్టణంలోని జయశ్రీ కాలనీకి చెందిన దేశుగారి బాలక్రిష్ణ (29) దిగువబస్టాండులో ఉన్న అంజనేయస్వామి గుడి ఎదుట టైలర్‌షాప్ నిర్వహించుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. అవివాహితుడైన బాలు మంగళవారం బి.కొత్తకోటకు చెందిన తన ఇద్దరు స్నేహితులతో కలిసి సరదాగా హార్సిలీహిల్స్‌కు విహారయాత్రకు వెళ్లాడు. సాయంత్రం వరకు సరదాగా సెల్ఫీలు దిగుతూ గడిపారు. హిల్స్ ఘాట్‌రోడ్డు పక్కన వున్న నీటికొలను అయిన గంగోత్రిలో దిగి ఈతకొడుతూ నీటమునిగి గల్లతయ్యాడు. తోడుగా వచ్చిన మిత్రులు భయభ్రాంతులై అందుబాటులో ఉన్న పర్యాటకులను పిలిచి సాయం అడిగారు. ఎవరు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. పోలీసులకు సమాచారం అందగానే సిబ్బంది, ఈతగాళ్లను, అగ్నిమాపక సిబ్బందిని తీసుకొని సంఘటనా స్థలానికి వెళ్లి బాలు ఆచూకీ కోసం ప్రయత్నించారు. చీకటిలో చేసేదిలేక వెనుదిరిగారు. బుధవారం ఉదయం బోట్లను, గజ ఈతగాళ్లను రప్పించి, యువకుడి ఆచూకీ కోసం ప్రయత్నించనున్నట్లు సీఐ తెలిపారు. బాలు గల్లంతైన వార్తతో బి.కొత్తకోట జయశ్రీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రామసముద్రంలో కార్డెన్‌సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

● 20 ద్విచక్రవాహనాలు సీజ్

రామసముద్రం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాజుల నగరంలో మంగళవారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ సత్యనారాయణ ఎస్‌ఐలు రవికుమార్, దిలీప్‌కుమార్, తిప్పేస్వామి, పోలీస్ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగా లేని 20 ద్విచక్రవాహనాలు, ఒక టాటా ఏస్ వాహనాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించొద్దని కోరారు. ప్రమాదాల బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. గ్రామాల్లోని కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రెడ్డెప్ప నాయుడు మృతదేహం

బి.కొత్తకోట ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బడికాయలపల్లె పంచాయతీ జింకలదాట్లపల్లెకు చెందిన గాలివీటి నరసింహలునాయుడు కుమారుడు రెడ్డెప్ప నాయుడు (45) ఇటీవల టమోటా పంట సాగు చేశాడు. గిట్టుబాటు ధరలు లేకపోవడం, పాడి ఆవులు సైతం సక్రమంగా పాలు ఇవ్వకపోవడంతో కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చే మార్గం లేకపోవడం, రుణదాతలు ఇంటి వద్దకు తిరుగుతుండడంతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి బి.కొత్తకోట పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని పరిశీలించి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేసి విచారణ చేస్తున్నట్లు బి.కొత్తకోట సీఐ జీవన్ గంగానాథ్ బాబు తెలిపారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

● మే 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాల డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) కోర్సులో ప్రవేశానికి డీఈఈ సెట్-2025 నోటిఫికేషన్‌ను రాష్ట్ర విద్యా శాఖ మంగళవారం విడుదల చేసింది. అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 29 నుంచి మే 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను మే 8వ తేదీలోగా అందజేయాలన్నారు. అలాగే హాల్ టికెట్లు మే 20వ తేదీ విడుదల అవుతాయని, డీఈఈ సెట్ పరీక్షలు జూన్ 2, 3వ తేదీల్లో ఉంటాయన్నారు. అలాగే డైట్ సెట్ పరీక్షా ఫలితాలు జూన్ 10వ తేదీ విద్యాశాఖ విడుదల చేస్తుందన్నారు. పరీక్షా కేంద్రాల ఎంపిక, అభ్యర్థుల అర్హతల నిబంధనలు, కోర్సు ఎంపిక విధానం వంటి పూర్తి సమాచారం కొరకు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన తెలియజేశారు. ప్రాథమిక విద్యకు నాణ్యతను తీసుకొచ్చే భవిష్యత్ టీచర్లకు ఇది మంచి అవకాశం అని, ఒక్క అభ్యర్థి సకాలంలో దరఖాస్తు చేసుకొని పరీక్షకు సన్నద్ధం కావాలని ఆయన కోరారు.

హామీల అమలేదీ : ఈశ్వరయ్య

కడప (సెవెన్‌రోడ్స్), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఎన్నికల వాగ్దానాలు, సూపర్‌సిక్స్ పథకాలు అమలుకు నోచుకోలేదని మంగళవారం కడపలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తానని ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల్లో ప్రకటించిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ పాల్గొన్నారు.

పాలకొండకు నిప్పు..

మంటలను ఆర్పేసిన అటవీ సిబ్బంది



భాకరాపేట బీట్ పాలకొండలో
మంటలను ఆర్పేస్తున్న అటవీ సిబ్బంది

సిద్దవటం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కడప రేంజ్ అటవీశాఖ పరిధి సిద్దవటం మండలం భాకరాపేటబీట్ పాలకొం డ అడవికి సోమవారం రాత్రి ఆకతాయిలు నిప్పు పెట్టడం తో కడప ఫారెస్ట్ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను ఆర్పేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎఫ్‌బీవో ఇందిర, రాజశేఖర్‌రాజు, భానుకిషోర్, ప్రొటక్షన్ వాచర్లు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ వికాస్

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పీటీఎంకు చెందిన దొరిగుండ్ల వికాస్ (18) బైక్‌పై బి.కొత్తకోట నుంచి స్వగ్రామానికి వస్తుండగా బాంబే ఎస్టేట్ సమీపంలో అదుపు తప్పి కింద పడిపోయాడు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతనిని స్థానికులు 108 వాహనంలో బి..కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

కోడూరు యువకుడు తిరువళ్లూరులో ఆత్మహత్య

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోడూరు పట్టణానికి చెందిన యువకుడు ఎం.ప్రతాప్ (30) సోమవారం రాత్రి తమిళనాడు రాష్ట్రంలోని తిరువళ్లూరులో ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రతాప్ తిరువళ్లూరులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ప్రతాప్ మృతిపై కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో హుటాహుటిన బంధువులు తిరువళ్లూరుకు తరలివెళ్లారు. అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్షలు నిర్వహించి అనంతరం మృతదేహాన్ని కోడూరుకు తరలించారు.

కోడిపందెం ఆడుతున్న ఏడుగురి అరెస్టు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోడిపందెం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మదనపల్లె పట్టణం రామిరెడ్డి లేఅవుట్‌లో కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసినట్లు ఆయన వివరించారు.

జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేస్తాం

● కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

సీకేదిన్నె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేస్తామని, ఉద్యాన పంటల సాగుతో రైతులకు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు చేకూరుతాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. జిల్లా రైతులను ఉద్యాన సాగులో ప్రోత్సహించే దిశగా మంగళవారం స్థానిక రాయచోటి రోడ్డులోని మాధవీ కన్వెన్షన్ హాలులో జిల్లా ఉద్యానశాఖ సమ్మేళనాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా అరటి, చీనీ, పసుపు, ఉల్లిగడ్డ తదితర పంటలను జిల్లా ఉద్యాన గ్రోత్ ఇంజక్షన్‌గా గుర్తించామన్నారు. ఈ పంటలను రాష్ట్రం, దేశం దాటి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందేలా చేస్తున్నామన్నారు. మన జిల్లాలో పండిన అరటి పంటకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు, ఆదరణ లభించడం మన జిల్లాకు గర్వకారణమన్నారు. పండించిన పంటకు సరైన ధర లభించడంలేదనే అంశాలపై మార్కెటింగ్ నిపుణులతో చర్చించామన్నారు. కడప జిల్లా ఉద్యాన ఉత్పత్తులను బ్రాండింగ్ చేయడం, ప్రచారం కల్పించడం, కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటు మౌలిక సదుపాయాలు కల్పించడం, మార్కెట్‌లో పోటీతత్వం పెంచడం, రైతులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో అవగాహన పెంపొందించడం రైతుకు ఆదాయం రెట్టింపు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

ఏపీఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ కడప జిల్లా హార్టికల్చరల్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్ర హార్టికల్చలర్, సెరీకల్చరల్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే 10-15 సంవత్సరాల్లో వ్యవసాయం, ఫిషరీస్, అనిమల్, సెరీకల్చలర్, ఉద్యానశాఖ లాంటి అనుబంధ సంస్థలు చాలా అవసరమన్నారు. రైతులు ఉద్యాన సాగు ఆచరిస్తూ ప్రకృతి వ్యవసాయంలోకి మారాలన్నారు.







జిల్లా ఉద్యానశాఖ సమ్మేళనంలో మాట్లాడుతున్న కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, చెన్నూరుకు చెందిన పసుపు రైతు బాలచంద్రను, కామనూరుకు చెందిన రైతు రాఘవరెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుట్టాసుధాకర్ యాదవ్, వరదరాజులరెడ్డి, ఆదినారాయణరెడ్డి

కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ ఉద్యాన పంటలకు అపారమైన అవకాశాలు, సదుపాయాలు ఉన్నాయని, ఉత్పత్తులు నిలువ చేసుకునేందుకు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని అన్నారు.. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ కడప ఉద్యాన పంటలు ప్రపంచ వ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు తెచ్చుకోవాలని, అందుకు అవసరమైన సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ అధికారులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి రైతులకు ప్రభుత్వ పథకాలు తెలియజేయాలన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో కోల్డ్ స్టోరేజీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల అవసరం ఎంతైనా ఉందన్నారు.

నిమ్మ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మధుమతి మాట్లాడుతూ జిల్లాలో వాటర్ రీసోర్స్ ఎంతో అనుకూలంగా, ఆశాజనకంగా ఉన్నాయన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుకు జిల్లాలో విపరీతమైన అవకాశం ఉందని, జిల్లాను హార్టికల్చలర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఉద్యాన పంటల సాగులో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా సహజ పద్ధతిలో పసుపు సాగుచేస్తున్న చెన్నూరుకు చెందిన ఆదర్శ రైతు కె.బాలచంద్రను, బహుళ పంటలను సాగుచేస్తున్న కామనూరుకు చెందిన ఆదర్శ రైతు రాఘవరెడ్డిలను అధికారులు సత్కరించారు. అంతకుముందు అధికారులు, ప్రజాప్రతినిధులు ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ అదితి సింగ్, అనంతరాజుపేట ఉద్యాన కళాశాల హెచ్‌వోడీ శివప్రసాద్, రాజా నాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ అధికారి శారదమ్మ, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు ఆనంద్‌నాయక్, కిరణ్‌కుమార్, హార్టికల్చరల్ అధికారి జ్యోతిర్మయి, మార్కెటింగ్, ఉద్యాన సంబంధిత అధికారులు, రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నలుగురు మట్కాబీటర్ల అరెస్టు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని సంజీవనగర్‌లో మట్కా ఆడు తున్న నలుగురు వ్యక్తులను టూటౌన్ సీఐ సదాశివయ్య అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.26,500 నగదుతో పాటు మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో వాజ్‌పేయ్ నగర్‌కు చెందిన కాకి కుళాయప్ప, సంజీవనగర్‌కు చెందిన బండారు లక్ష్మీనారాయణ, బండారు శ్రీనాథ్, అంకట రాముడులు ఉన్నారు. వీరందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాలికను గర్భిణీని చేసిన వ్యక్తిపై పోక్సో కేసు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషను పరిధిలోని ఒక సప్లయిర్స్ దుకాణంలో పనిచేస్తున్న వ్యక్తి హోటల్లో పనిచేస్తున్న బాలికకు మాయమాటలు చెప్పి గర్భిణీని చేశాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి పంపగా ఆరు నెలల గర్భిణీగా వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం.

నేల ఆరోగ్యం.. రైతు సౌభాగ్యం


మట్టి నమూనాలను పరిశీలిస్తున్న సిబ్బంది

- ఖరీఫ్‌కు ముందే మట్టి పరీక్షలు
- జిల్లాలో 24,288 నమూనాల సేకరణే లక్ష్యం
- గత అయిదేళ్లలో అరకొరే
- ప్రభుత్వంపై రైతుల ఆశలు

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పొలంలో మంచి పంట పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో ప్రధాన పోషకాలు అయిన నత్రజని, భాస్వరం, పొటాష్, పరిమాణాల్లో మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. భూమిలో ఏయే పోషకాలు క్షీణించాయి, తదితరాలు వెలువడుతాయి. ఇంతటి కీలకమైన సమాచారం అందించే భూసార పరీక్షలను గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు ముందే మట్టి పరీక్షలు చేయించాలని నిర్ణయించారు. 2025-26 ఏడాదికి కడపజిల్లాలో 24,288 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. పోషకాలతో అధిక దిగుబడులు, భూసారం భద్రంగా ఉన్నప్పుడే మొక్కల ఎదుగుదల ఉంటుంది. తద్వారా దిగుబడి నాణ్యంగా ఉండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో ప్రధాన పోషకాలు అయిన ఉదజనిసూచిక, లవణ పరిమాణం, నత్రజని, భాస్వరం, పొటాష్ లభించే మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. రసాయనిక ఎరువుల వాడకం జరిగిందని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. పంటల సాగుకు తగిన నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు భూసార పరీక్ష ఫలితాల మేరకు పోషకాలను అందించి దిగుబడులు పొందవచ్చు.

సేకరణ ఇలా...

సాంప్రదాయ పద్ధతులను పక్కనపెట్టి సాంకేతిక దిశగా అడుగులు వేసేలా రైతన్నలను వెన్నుతట్టి ప్రోత్సహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కడపజిల్లాలో 17,800 అన్నమయ్య జిల్లాలో 16,500 మట్టి నమూనాలను సేకరించారు. ప్రస్తుతం జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 24,288 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ నెల 15 నుంచి మే 15 వరకు ఈ సేకరణలను పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. వ్యవసాయ శాఖ కడప డివిజన్ పరిధిలో 3,366, కమలాపురం 3,300, పులివెందుల 3,696, ముద్దనూరులో 2,674, ప్రొద్దుటూరు 3,102, మైదుకూరు 2,904, బద్వేలు 1,814, పోరుమామిళ్ల 3,432 మొత్తం 36 మండలాల్లో 368 రైతు సేవా కేంద్రాల పరిధిలో 24,288 నమూనాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కడప, కమలాపురం, పులివెందుల, బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని 19 మండలాల్లోని 12,176 నమూనాలను సంచార భూసార పరీక్షల వాహనం (ఎంఎస్‌టీఎల్) ద్వారా విశ్లేషణ చేయాల్సి ఉంది. ముద్దనూరు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పోరుమామిళ్ల డివిజన్లలోని 17 మండలాల పరిధిలో 12,112 మట్టి నమూనాలను ఊటుకూరు భూసార పరీక్షల కేంద్రానికి (ఎస్‌టీఎల్) పంపించాలి.

పకడ్బందీ ప్రణాళికతో....

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఖరీఫ్ సీజన్ మొదలయ్యేనాటికి భూసారానికి సంబంధించిన ఫలితాలు అందించేలా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రబీ సీజన్ పూర్తవడంతో భూసార పరీక్షలు చేసేందుకు అనువైన సమయం లభించింది. ఈ క్రమంలో జిల్లాలో మట్టి నమూనాల సేకరణ, తరలింపు, పరీక్షించడం, ఫలితాలను రైతులకు అందించే కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. దీంతోపాటు రైతులకు ఆరోగ్యకార్డులను సైతం అందించనున్నారు. ఇందులోనే పరీక్షా ఫలితాలను పొందుపరచనున్నారు. ఫలితంగా వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

> **రైతు అవగాహన కలిగి ఉండాలి**
>
> జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. భూసార పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పారదర్శకత కోసం ఎస్‌హెచ్‌సీ యాప్ ఆధారిత సేవలు అనుసంధానం చేస్తున్నాం. రైతు పొలాల నుంచి నమూనాలను సేకరించి త్వరితగతిన పరీక్షలు చేసి సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించి రైతులను అప్రమత్తం చేస్తాం.
>
> - రాధాదేవి, ఏడీ, ఊటుకూరు భూసార పరీక్ష కేంద్రం

నమోదుకు ప్రత్యేక యాప్

నేలను బట్టి అయిదారు ఎకరాలకు ఒక నమూనాను సేకరించవచ్చు. నమూనా తీసే పొలంలో 10 నుంచి 20 చోట్ల మట్టిని సేకరించాలి. పారతో వి ఆకారంలో 6 నుంచి అంగుళాల గుంత తవ్వాలి. అందులోని మట్టిని పాలిథిన్ సంచిలో ఉంచి బాగా కలపాలి. ఆ మట్టిని నాలుగు భాగాలుగా విభజించి ఎదురెదురుగా ఉన్న భాగాలను తీసుకుని అరకిలో మట్టిని తీసేకుని పరీక్షకు పంపాలి. జిల్లా వ్యాప్తంగా గతంలో నిర్వహించిన పరీక్షల్లో ప్రధానంగా సేంద్రిక కర్బనం, నత్రజని, జింక్, ఐరన్ లోపాలను గుర్తించారు. తాజాగా భూసార పరీక్షలు చేపడితే భూమిలో నత్రజని, బోరాన్, జింక్, ఇనుము, పొటాష్, భాస్వరం, ఇతర సూక్ష్మపోషకాలు ఎంతమేరకు ఉన్నాయో తెలుస్తుంది. ఈసారి పక్కాగా పరీక్షించేందుకు ఎస్‌హెచ్‌సీ యాప్‌ను తీసుకొచ్చారు. పొలంలో మట్టి నమూనా సేకరణ స్థలం కనిపించే లా రైతులతో సెల్ఫీ తీసుకుని ఫోటో భద్రపరచాలి.


ల్యాబ్‌కు తరలించేందుకు సేకరించిన నమూనాతో ఏవో శివశంకర్‌రెడ్డి

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థి ప్రతిభ


విద్యార్థి సుబ్బారెడ్డిని అభినందిస్తున్న ఎంఈవో సునీత

చెన్నూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నిర్వహించిన క్రీడా పోటీల్లో చెన్నూరుకు చెందిన బసిరెడ్డి సుబ్బారెడ్డి అనే విద్యార్థి ప్రథమ బహుమతి అందుకున్నారు. ఈ మేరకు స్థానిక మం డల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో-2 సునీత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నాదేవి, పద్మనాభం, రమణయ్య, ఉమామహేశ్వరి, అరుణ కుమార్‌లతో అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఈ నెల 21, 22, 23 తేదీల్లో విజయవాడలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో చెన్నూ రు భవిత సెంటరు నుంచి సుబ్బారెడ్డి పాల్గొని.. వంద మీటర్ల రన్నింగ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం, 200 మీటర్ల రన్నింగ్‌లో మూడో బహుమతి గెలుచుకున్నారని తెలిపారు. ఈ విద్యార్థి ఇటీవల వచ్చిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణలయ్యారని తెలిపారు. ఈఆర్‌టీ ఎమ్మార్సీ సిబ్బంది గురవయ్య పాల్గొన్నారు.


బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిక అధికారి కె.సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడో తరగతికి సంబంధించి ఆంగ్ల మాధ్యమంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని వర్గాల వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు సంబంధించి గిరిజనులు మాత్రమే ప్రవేశానికి అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు సంక్షేమ గురుకుల పాఠశాల కడప, పులివెందుల, మైదుకూరు, పోరుమామిళ్లలో సంప్రదించాలని కోరారు. ఆసక్తి ఉన్న అర్హులైన విద్యార్థులు అడ్మిషన్ల కోసం మే 1వ తేదీ నుంచి 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పాఠశాలలోని ఖాళీల కంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వస్తే మే 30వ తేదీ గిరిజన సంక్షేమ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని ఆమె వివరించారు.

సామాజిక అంశాలపై యువతకు అవగాహన

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ ద్వారా యువతకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారి క అధికారి డి.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫ రెన్స్‌లో ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామం, వార్డుల్లో కిశోర బాలికలకు ముఖ్యంగా 15 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు కలిగిన అమ్మాయిలకు గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారంలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తూ అంగన్వాడీ వర్కర్స్, వీఓహెచ్‌లు కలిసి దాదాపు 12 అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయించినట్లు వివరించారు. ఈ మేరకు షెడ్యూల్ ప్రకారం మే 2 నుంచి జూన్ 10 వరకు ఈ సమ్మర్ క్యాంప్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎం, మండల డెవలప్‌మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి వెల్లాల బ్రహ్మోత్సవాలు



వెల్లాల సంజీవరాయస్వామి , చెన్నకేశవస్వామి

రాజుపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అతి పురాతన పుణ్యక్షేత్రమైన వెల్లాల సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను మే 8 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రమణ తెలిపారు. ఆ మేరకు మంగళవారం బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఈవో ఆవిష్కరించారు. ఇందులో భాగంగా మే 8న (గురువారం) అంకురార్పణ, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 9న (శుక్రవారం) శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం, 11న (ఆదివారం) హనుమంతోత్సవం, 12న (సోమవారం) గరుడోత్సవం, నట రాజకళాక్షేత్రం ప్రొద్దుటూరు వారిచే సాంస్కృతిక నృత్య ప్రదర్శన, 14న (బుధవారం) రథోత్సవం, 16న స్వామివార్ల చక్రస్నానం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్స వాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి, గంగిరెడ్డి, మండల టీడీపీ నేత సుబ్బిరెడ్డి, ఆలయ మాజీచైర్మన్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పట్టించుకోడు...ప్రభుత్వం పట్టించుకోదు

- డిప్యూటీ సీఎంకు తులసిరెడ్డి లేఖ

వేంపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీని ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పట్టించుకోడు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. సమస్యల వలయంలో చిక్కుకున్న వేంపల్లె మేజర్ పంచాయతీ గురించి డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు తులసిరెడ్డి లేఖ రాశారు. అందులో వేంపల్లె మురికికూపంగా తయారైందని.. దాదాపు 60వేల జనాభా ఉంటుందని.. గత మార్చి 5వ తేదీ ఈఓను ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. ఈఓఆర్డీని బదిలీ చేసిందని, అప్పటి నుంచి ఈఓ, ఈఓఆర్డీలు లేరన్నారు. అవినీతి ఆరోపణలు, రాజకీయ జోక్యంతో భయపడి ఎవరూ రావడం లేదన్నారు. వాటర్ స్కీమ్ సిబ్బందికి ఆరు నెలలుగా, గ్రామ సచివాలయ సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు లేవు, పారిశుధ్యం అధ్వాన్నంగా తయారైంది.. తాగునీటి సమస్య జటిలమైంది... ఇలా పంచాయతీకి సంబంధించి అనేక సమస్యలతో సతమతవం అవుతోందని.. వెంటనే ఈఓ, ఈఓఆర్డీలను నియమించాలని కోరారు.

ఇందిరకు వైవీయూ డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పరంగా లభించే సాధారణ ప్రారంభ పదార్థాలు, పర్యా వరణ అనుకూల సింథటిక్ పద్ధతులను ఉపయోగించి మల్టీ ఫంక్షల్ ఆర్గానిక్ పదార్థాలను కనుగొన్నందుకు వైవీ యూ వీజీ కళాశాల రసాయన శాస్త్ర శాఖ స్కాలర్ ఎం.ఇందిరకు యోగివేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు పి.వసు గోవర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో డెవలప్‌మెంట్ ఆఫ్ సస్టైనబుల్ ఆర్గానిక్ సింథటిక్ ప్రొటోకాల్స్ ఎంప్లాయింగ్ ఆయానిక్ లిక్విడ్స్, బెమ్మిడజోలియం సాల్ట్స్ అండ్ అల్ట్రాసోనిక్ ఇర్రే డియేషన్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. పరిశీలించిన నిపుణుల బృందం థీసిస్‌కు డాక్టరేట్ అర్హత ఉన్నట్లు ప్రకటించారు.

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఇకపై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

సింహాద్రిపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు ప్రాంతీయ బ్యాంకులు విలీనం అయినట్లు సింహాద్రిపురం ఏపీజీబీ మేనేజర్ కృష్ణకిషోర్, ఫీల్డ్‌ఆఫీసర్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ విలీనం అయ్యాయని తెలిపారు. ఈ నాలుగు బ్యాంకులు విలీనం అయి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా అవతరించినట్లు తెలిపారు. విలీనం అయినప్పటికీ ఖాతా నెంబర్‌లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు లేదా బ్రాంచ్‌చిరునామాలతో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు లేదని ఖాతాదారులకు తెలియజేశారు.

ఆరాధనోత్సవాలకు ప్రత్యేక బస్సులు

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్ర స్వాముల ఆరాధనోత్సవాలకు మైదుకూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు మంగళవారం డిపో మేనేజరు శ్రీరాం కుమార్ తెలిపారు. ఆరాధనోత్సవాలకు 6వ తేదీ మధ్యాహ్నం నుంచి 8వ తేది రాత్రి వరకు బస్సులను నడపనున్నట్లు తెలిపారు. అలాగే మైదుకూరు నుంచి మిట్టమానుపల్లె మీదుగా బ్రహ్మంగారిమఠం, పోరుమామిళ్ల, జ్యోతి క్షేత్రానికి కూడా బస్సులను నడపనున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



సింహాద్రిపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవరంగుట్టపల్లెకు చెందిన గోపాలదాస్ ఆశీర్వాదం (19) అనే యువకుడు కడుపునొప్పి తాళలేక మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిసిన సమాచారం మేరకు.. ఆశీర్వాదం గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుడేవాడు. పలు ఆసుపత్రులలో చికిత్స తీసుకున్నా ఫలితం లేకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని అన్న సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్ర మోహన్‌రెడ్డి తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



అట్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురాయపల్లె జంగముకుంట వద్ద నాగదాసరి దేవేంద్ర (35) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. గోపవరం మండలం ఎస్.రామాపురం హరిజన వాడకు చెందిన దేవేంద్రకు మతిస్థిమితం లేదు. దీంతో వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తప్పిపోయాడు. ఈ మేరకు మృతుడి తండ్రి నాగదాసరి తిరుపాలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో గోపవరం అట్లూరు మండలాల మధ్య అటవీ ప్రాంతమైన సూరా యపల్లె సమీపంలో మృతదేహం ఉన్నట్లు గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంళవారం సాయం త్రం ఎస్ఐ రామక్రిష్ణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కడుమూరు లక్ష్మిదేవి నేత్రదానం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం కచేరి రోడ్డులోని నాగయ్య ఆశ్రమంలో ఉంటున్న కడుమూరు లక్ష్మీదేవి (50) మంగళవారం మరణించడంతో ఆశ్రమం నిర్వాహకులు నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు లక్ష్మీదేవి పార్థీవదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు.

10 నుంచి నారాపురం వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న నారాపురం వెంకటేశ్వరస్వామి దేవాలయం

జమ్మలమడుగు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో వెలసిన నారాపురం వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 10వ తేదీ అంకురార్పణతో ప్రారంభం అవుతాయని ఆలయ అధికారి మోహన్ తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఉత్సవాల ప్రకటనను అధికారులతో కలిసి విడుదల చేశారు. అందులో భాగంగా మే 10వ తేదీ శనివారం అంకురార్పణతో బ్రహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 11న ధ్వజారోహణం, సాయంత్రం పెద్ద శేష వాహనం, 12న చిన్న శేష వాహనం, సాయంత్రం హంసవాహనం, 13న ముత్యపు పందిరి వాహనం, సాయంత్రం సింహవాహనం, 14న కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమంత వాహనం, 15న మోహినీ అలంకారం, సాయంత్రం గరుడ వాహనం, 16న సర్వభూపాల వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, గజవాహనం, 17న శ్రీనారాపురం వెంకటేశ్వరస్వామి రథోత్సవం ఉంటుందన్నారు.సాయంత్రం అశ్వవాహనంలో ఊరేగింపు, 18న సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 19న చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, 20న సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

వేలంలో సిండికేట్

నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం వివిధ దుకాణాలు, జాయింట్‌వీల్స్ తదితర వాటికి సంబంధించి వేలం నిర్వహించారు. ఓపెన్ టెండర్లకు సంబంధించి 13 మంది డీడీలు కట్టి ఆలయంలో అందజేశారు. టీటీడీకి సంబంధించిన వేలం రూ.10,00,111లతో అధికారులు ప్రారంభించారు. అయితే 13 మంది వేలంపాటదార్లలో పత్తి మహేంద్ర అనే వ్యక్తి మాత్రం పాల్గొని రూ.10.30 లక్షలకు వేలం దక్కించుకున్నారు. అదే 2023లో రూ.15.10 లక్షలు వేలం ద్వారా టీటీడీకి ఆదాయం వచ్చింది. 2024లో ఎన్నికల కోడ్ ఉన్నందున టెండర్లు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. టీటీడీ డిప్యూటీ డీఈవో నటేష్‌బాబు, జేఈ కళావతి, సూపరింటెండెంట్ హనుమంతు, సిబ్బంది గురుస్వామి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గ్రూప్ ప్రజల స్థితిగతులను గుర్తించాలి

- జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ ఉమా మహేశ్వరకుమార్

కడప, కలెక్టరేట్, ఏప్రిల్ 29,(ఆంధ్రజ్యోతి) హైరిస్క్‌గ్రూపు ప్రజల జీవన స్థితిగతులు తెలుసుకోవాలని జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమా మహేశ్వరకుమార్ పేర్కొన్నారు. మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ సహకారంతో హైరిస్క్ గ్రూప్ ప్రజల స్థితి గతులు, సమాజంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రీ ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ ఉమా మహేశ్వరకుమార్ హైరిస్క్ గ్రూపుల వారి వివరాలకు సంబంధించి వారి అనుమతితో సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి నగిలి రవిబాబు మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల సర్వేను బాధ్యతగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ డాక్టర్ అనూష, జిల్లా ప్రోగ్రామ్ అధికారి అలీహైదర్, టిన్‌గోస్ ప్రాజెక్ట్ డైరెక్టర్స్, ఏఎన్ఎంలు, మెడికల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కార్మికులకు సెలవు దినంగా ప్రకటించాలి

కడప(వినాయకనగర్), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మేడే సందర్భంగా మే 1వ తేదీ కార్మికులకు సెలవు దినంగా ప్రకటించాలని కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ ఒక ప్రకటనలో ఆయా సంస్థల యాజమాన్యాలను కోరారు. ఆయా దుకాణదారులు, సంస్థల యాజమాన్యాలు ఒక వేళ పని చేయించుకుంటే 30 రోజులలోపు ఒక రోజు సెలవు ఇచ్చి ఆ రోజుకు రెట్టింపు వేతనం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కార్మికులు కింది అధికారుల ఫోన్ నెంబర్లను కడప 9492555204, ప్రొద్దుటూరు 9492555209, కమలాపురం 9492555207, బద్వేల్ 9492555212, పులివెందుల 9492555213ను సంప్రదించాలన్నారు.

నేడు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

సుండుపల్లె, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండల కేంద్రంలోని ఎంకేఆర్ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌కు సుండుపల్లె మండలం నుంచి 21 జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ సుమారు 13 రోజుల పాటు జరుగుతుందన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మేనల్లుడు, టీడీపీ యువనాయకుడు మౌర్యారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మొదటి మ్యాచ్ సూపర్ కింగ్ జట్టు, చెరుకువాండ్లపల్లె జట్ల మధ్య జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు టోర్నమెంట్ ప్రారంభమవుతుందని క్రీడాకారులు, క్రీడాభిమానులు హాజరుకావాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన అవసరం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన అవసరమని రైల్వేకోడూరు ఐసీడీఎస్ సీడీపీవో సౌభాగ్యమ్మ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం -2006 ప్రకారం నేరమని తెలిపారు. 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు, 21 సంవత్సరాల లోపు మగ పిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎంపీడీవో నాగార్జునరావు, మండల విద్యాశాఖాధికారి-2 సుందర్‌బాబు, ఏసీడీపీవో టీ. సరళాదేవి, సూపర్‌వైజర్లు వై.ప్రవల్లిక, అనసూయమ్మ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వండి

రాయచోటిటౌన్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలపై చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, 112లకు కాల్ చేయాలని జిల్లా స్త్రీశిశు సంక్షేమ సాధికారిక అధికారి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దేవదాయశాఖ అధికారులు ఆలయాల్లో వివాహం చేసుకోబోయే వారి నుంచి వయసు నిర్ధారణ ధ్రువీకరణ పత్రాన్ని, పదవ తరగతి మార్క్స్ లిస్టు గానీ, ప్రభుత్వం జారీ చేసిన పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం గానీ, స్కూల్ అడ్మిషన్‌లో ఉన్నటువంటి పుట్టిన తేదీని గానీ తీసుకోవాలన్నారు.

నాడు-నేడు పనులకు శెట్టిపల్లి పాఠశాల దూరం

- కనీస వసతులకూ నోచుకోని విద్యార్థులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



అసంపూర్తిగా ఉన్న వంట గది



ఆరుబయట వంట చేస్తున్న దృశ్యం



పాఠశాల ప్రాంగణంలో నిల్వచేరిన మురుగునీరు



డోర్ కూడా సక్రమంగా లేని మరుగుదొడ్డి

సంబేపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ఆ పాఠశాల విద్యార్థులు మాత్రం కనీస వసతులు కూడా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబేపల్లె మండల శెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 161 మంది విద్యార్థులు ఉన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతం. అక్కడ చదువుకునే విద్యార్థులందరూ మారుమూల ప్రాంతం చెందిన పేద విద్యార్థులే. గత ప్రభుత్వంలో నాడు- నేడు నిధులు రూ. 64 లక్షలు మంజూరు చేశారు. రాజకీయ కారణాలతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

పాఠశాలలో నెలకొన్న సమస్యలు

పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. తరగతి గదుల్లో మద్యం సేవిస్తున్నారు. తరగతి గదులు వర్షం వస్తే ఉరుస్తున్నాయి. తలుపులు, కిటికీలు కూడా సక్రమంగా లేవు. 161 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో తాగునీటి సమస్య నెలకొంది. వంట గదులు గోడల వరకు కట్టి వదిలేశారు. వాటిలో మొండి గోడలు, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఆరుబయటే వంట చేస్తున్నారు. వర్షాలు వస్తే ఇబ్బంది తప్పడం లేదు. మురుగుకాలువల ద్వారా వచ్చే నీరు పాఠశాల ప్రాంగణంలో చేరి మడుగును తలపిస్తున్నాయి. విద్యార్థులకు ఆట స్థలం లేదు. బాలికలకు మరుగుదొడ్లు లేక ఆరుబయట అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బాలికలు ప్రతిరోజు అవస్థలు తప్పడం లేదు. ఉన్న మరుగుదొడ్డి కూడా సక్రమంగా లేక వినియోగించుకోవడం లేదు. పాఠశాలలో అన్నీ సమస్యలే దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా కనీస వసతులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

విద్యార్థులు అవస్థలు పడుతున్నారు



పాఠశాలకు మారుమూల ప్రాంతం నుంచి వచ్చే ఆడపిల్లలు మరుగుదొడ్లు లేక ఆరుబయటకు వెళుతున్నారు. పిల్లలకు భద్రత లేకుండా పోయింది. గత ప్రభుత్వంలో నాడు- నేడు కింద మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయారు. సమస్యను స్థానిక నా యకులతో కలిసి మంత్రి దృష్టికి తీసుకెళ్తాం. పాఠశాల కు నిధులు మంజూరు చేస్తే మౌలిక వసతులు కల్పిస్తాం.

\- బాషావల్లి, స్కూల్ కమిటీ చైర్మన్, శెట్టిపల్లి

నిధులు వెనక్కిపోయాయి

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలంటే కనీసం నిధులు కూడా లేవు. నాడు- నేడు నిధులు రూ.64 లక్షలు వెనక్కిపోయాయి. ప్రస్తుతం నిధులు మంజూరైతే తప్ప విద్యార్థులకు వసతులు కల్పించడం కష్టంగా ఉంది. కూటమి ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయాలి.

\- శ్రీనివాసులు, మండల విద్యాశాఖ అధికారి, సంబేపల్లె

కుంటను తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

- వాహనదారులకు ఇక్కట్లు



సుండుపల్లెలో మురుగు నీటితో కుంటను తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

సుండుపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):సుండుపల్లె మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ఎదురుగా ఆర్‌అండ్‌బీ రోడ్డు చినుకు పడితే చాలు కుంటను తలపిస్తోంది. ఆర్‌అండ్‌బీ రోడ్డు ఓ వైపు ఎత్తుగా వేయడంతో ఇండ్లలో నుంచి వచ్చే మురికినీరు, వర్షపు నీరు, డ్రైనేజీల ద్వారా బయటికి వెళ్లడం లేదు. శుక్రవారం చినుకులు పడడంతో మోకాళ్ల లోతు వర్షపు నీరు మురికినీరు నీరు రోడ్డుపై చేరి వాహనదారులు, బాటసారులకు ఇబ్బందిగా మారింది. గత కొన్ని సంవత్సరాల నుండి ఇదేవిధంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం పలుఆర్లు ఆర్‌అండ్‌బీ అధికారులు, పంచాయతీ అధికారులకు తెలియజేసినా కూడా సమస్య పరిష్కరించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం బ్యాంకు సేవలో నిమిత్తం, సుమారు ఐదు గ్రామ పంచాయతీల నుండి మండల కేంద్రానికి ప్రజలు రావాలంటే ఆ మురికికుంట నుండి రావాల్సి ఉండడంతో తీవ్ర సమస్యగా మారింది. సమస్య పరిష్కరించి పుణ్యం కట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



బాధితుడు సురేశ్‌కు చెక్కును అందజేస్తున్న సాయిలోకేశ్

నందలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రవాసి పూల సురేష్‌కుమార్ మెదడు సంబంధిత వ్యాధి కారణంగా వేలూరు సీఎంసీ హాస్పిటల్‌లో వైద్యం చేయించుకుని వైద్య ఖర్చులకు ప్రభుత్వ సాయం అందించాలని కోరారన్నారు. దీంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి సురేష్ విషయం తెలపతడంతో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కోరగా బాధితుడు సురేష్‌కు రూ.4,61,770 మంజూరు చేశారన్నారు. ఆ చెక్కును బాధితుడి ఇంటివద్దకు వెళ్లి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట అసెంబ్లీ కో కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్, రాష్ట్ర మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, బీజేపీ మండల కార్యకర్తలు, నాయకులు రాచూరి మురళి, జయకుమార్‌రెడ్డి, మహేష్, హెచ్‌డీ ప్రసాద్, మండెం నాగేంద్ర, గంగాధర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని



రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని సోమవారం మంగళగిరిలోని సచివాలయంలో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ కలిశారు. ఈ సమా వేశంలో పలు కీలకమైన అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గ ప్రస్తుత పరిస్థితులు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ప్రజలకు చేరువయ్యేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి విస్తృతంగా చర్చించారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ముఖ్యమంత్రి ఆరా తీశారన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సోమిశెట్టి మనోహర్‌బాబు తెలిపారు. మధ్యాహ్నా 3.30 నుంచి 5.30 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల దీక్షలు





రాయచోటి: రెండవ రోజు రిలే నిరాహార దీక్షల్లో ఆర్టీసీ ఉద్యోగులు... రాజంపేట: నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

రాయచోటిటౌన్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాయచోటి డిపో ఎదుట మంగళవారం రెండవ రోజు కూడా ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఎన్ఎంయూ రీజనల్ అధ్యక్షుడు ఎంఎన్‌రావు, కార్యదర్శి వీఎస్ఎం రాజు డిపో ఎదుట రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. రెండవ రోజు రిలే నిరాహార దీక్షల్లో ఉద్యోగులు ఎం. రెడ్డెప్ప, సుధాకర్, హరినాథ, ఎంహెచ్‌నాయుడు పాల్గొన్నారు. అనంతరం నేషనల్ మజ్దూర్‌యూనిటీ అసోషియేషన్ రీజనల్ నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గతంలో అనేక దఫాలుగా ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు, ధర్నా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కారం రాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంఆ రిలే నిరాహార దీక్షల కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. రీజనల్ నాయకులు సీవీ రమణ, ఎంఎస్ ప్రసా ద్, టీ. రామాంజులు, డిపో నాయకులు ఆర్‌వీ గోపాల్, డీఎస్ వాసులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలో ఆర్టీసీ ఉద్యోగులు

రాజంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజంపేట ఆర్టీసీ డిపో ఎదుట ఎస్ఎంయూ ఆధ్వర్యంలో రెండో రోజైన మంగళవారం రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి రమణ, గ్యారేజి కార్యదర్శి దేవరాజులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, సర్క్యులర్ 1/2019 అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్ ఆపాలని, గ్యారేజ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. అనారోగ్య సెలవుకు పూర్తి వేతనం చెల్లించాలని, లైట్ ఔట్ అలెవన్స్ 400 రూపాయలు వెంటనే చెల్లించాలన్నారు. పారదర్శకమైన ట్రాన్స్‌ఫర్‌లు పాలసీ అమలు చేయాలని, ఉద్యోగుల విశ్రాంత దంపతులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో అనుమతించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ లీవులు తక్షణమే మంజూరు చేయాలని, ఇంకా ఉన్న సమస్యలపై ప్రత్యేక నినాదాలు చేస్తు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్యారేజి అధ్యక్షుడు గోపాల్, డిపో ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, ఈశ్వరి, జాయింట్ సెక్రటరి సుబ్బయ్య, ఆర్వీ భాస్కర్, శంకరయ్య, కుమారితో పాటు గ్యారేజ్ డిపో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కశ్మీర్‌లో ఉగ్రదాడి అమానుషం

వీరబల్లి, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గంలో పర్యాటకులపై పాకిస్థాన్ ముష్కరులు ఉగ్రదాడిని ఖండిస్తూ వీఆర్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో యువకులు స్థానిక బస్టాండులో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ యావత్ భారత జాతి గర్వించేలా పాకిస్థాన్ ఉగ్ర వాదులకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సంపత్ మెడికల్ వెంకట్రమణ, డాక్టర్ వెంకటేశ్, మంజునాథ్, చిరంజీవి, హేమంత్, నాని, కార్తీక్, చాను పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

రామాపురం,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు మంగళవారం నీలకంఠ్రావుపేట ఉప సర్పంచ్ ఎస్. మహబూబ్‌బాషా ఫీల్డ్ అసిస్టెంట్ పెంచల్‌రెడ్డితో కలిసి మజ్జిగ ప్యాకె ట్లు పంపిణీ చేశారు. కూలీలు ఉపసర్పంచ్ మహబూబ్‌బాషాకు, పెంచల్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలి : సీఐటీయూ



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న పబ్లిక్ స్కూల్లో మహిళలను వేధిస్తున్న సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్కూల్ గేటు బయట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్లో నాన్‌టీచింగ్ సిబ్బందిగా హౌస్‌కీపింగ్, స్కావెంజర్స్, కేర్‌టేకర్‌గా పనిచేస్తున్న మహిళలను సూపర్‌వైజర్ జమాల్ వేధింపులకు గురి చేస్తున్నారని, ఆ సూపర్‌వైజర్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని పేర్కొన్నారు. హెచ్ఎం రేవతికి ఫిర్యాదు చేయగా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా పై అధికారులనే ప్రశ్నిస్తావా అని ఆ మహిళను డ్యూటీకి రావద్దని ఆదేశించడం బాధాకరమన్నారు. ఈ విషయం కార్మికుల యూనియన్ నాయకుడు కాంట్రాక్టర్ మహేష్‌ను నిలదీయగా స్పందించలేదన్నారు. బాధితురాలిని విధులకు రావద్దని చెప్పడంతో తోటి మహిళలు ఆగ్రహం వ్యక్తం చేసి విధులు బహిష్కరించారు. దీనిపై సీపీవో సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా విచారిస్తామన్నారని పేర్కొన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి నాగిపోగు పెంచలయ్య, కె.లక్ష్మీ, బి.సురేఖ, పి.లక్ష్మీప్రసన్న, కె.జయలక్ష్మీ, బి.హేమలత, ఇ.సౌజన్య, టి.రాజామణి, టి.లింగమ్మ, ఎం.సుగుణ, కె.మేరి, జె.వరలక్ష్మీ, ఎస్.రాధా, ఎల్.మాణిక్యమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవచూపడం అభినందనీయం

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మంగంపేట లారీ డ్రైవర్లు, ఓనర్ల అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి సీపీవో సుదర్శన్‌రెడ్డి చొరవచూపడం అభినందనీయమని ఆ యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. మంగంపేట లారీ డ్రైవర్స్, ఓనర్స్ ప్రెసిడెంట్ కేశవులు, వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో మంగళవారం లారీ డ్రైవర్లు, ఓనర్ల సమావేశం నిర్వహించారు. యూనియన్ కార్యదర్శి సిగమాల రవిశంకర్‌రెడ్డి, ట్రెజరర్ రాజగోపాల్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కొట్టారు మణి, కుప్పాల నాగరాజు, పి.సుబ్రమణ్యంరెడ్డి, కె.సుబ్రమణ్యంరెడ్డి, లారీ డ్రైవర్స్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాజంపేటలో వైద్యశిబిరం ఏర్పాటు

సిద్దవటం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్.రాజంపేటలో డాక్టర్ రంగలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. రక్తపూతల నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రతి ఇంటిలో నీటి తొట్లల్లో లార్వా ఉత్పత్తి కాకుండా అబిట్ పిచికారీ చేశామన్నారు. గ్రామంలో విషజ్వరాలు ఎవరికీ లేవన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తులు ఉంటే తెలపండి

రాజంపేట టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు తిరుగుతుంటే వారి సమాచారం ఇవ్వాలని రాజంపేట పట్టణ సీఐ పి.రాజా పేర్కొన్నారు. మంగళవారం సీఐ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. అదేవిధంగా వాహనాలు తనిఖీ చేసి వాటి రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు లేదా అక్రమంగా నివసిస్తున్న వారి వివరాలపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని ఆలయం వద్దకు చేరుకుని గ్రామస్థులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ రాజా మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. మొబైల్ ఫోన్ ఎంతవరకు అవసరమో అంతవరకే ఉపయోగించుకోవాలన్నారు. అలాకాకుండా అనవసర విషయాలపై మెసేజ్, పోస్టులు పెడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలను వివరించండి

గాలివీడు, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాల గురించి ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వాలని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పేర్కొన్నారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం సభాభవనంలో ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ అధ్యక్షతన ఎంపీడీవో ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రజా సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు ప్రశ్నలను సంధించారు. వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో అధికారులు కనీస సమా చారం కూడా ప్రజాప్రతినిధులకు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ భాగ్యలత, అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

రాయచోటిటౌన్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఎన్జీవో హోమ్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్జీవో సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, రాయచోటి తాలూకా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం వారు ఎన్జీవో హోమ్‌లో మీడియాతో మాట్లాడుతూ మే 1న ఎన్జీవో భవనం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఏ. విద్యాసాగర్ వస్తున్నారని, వారి చేతుల మీదుగా ప్రారంభిస్తారన్నారు. మే 1న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ కళాశాల గ్రౌండ్ నుంచి నేతాజి సర్కిల్ మీదుగా బస్టాండు ఎన్జీవో హోమ్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి డీ. రవికుమార్, రాయచోటి కార్యదర్శి శ్రీనివాసులు, సహాధ్యక్షులు మహదేవ, కోశాధికారి బీ. దేవేంద్ర, ఉపాధ్యాయులు రవిశంకర్, హరిప్రసాద్, జాయింట్ సెక్రటరీ శివారెడ్డి, రఘు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాయచోటి మండల పరిధిలోని సుండుపల్లె రోడ్డులో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు ఎదురుగా నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. అనరంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంత పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో ఇళ్లను మంజూరు చేసిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్లపనులను త్వరగా పూర్తి చేయించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. టిడ్కోలో రోడ్డు పనులు, డ్రైనేజీ, విద్యుత్, నీటి సౌకర్యం వంటి మౌలి క వసతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో పేదలకు నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఉపాధ్యక్షులు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు శివారెడ్డి, రామచంద్ర, విష్ణువర్ధన్‌రెడ్డి, దిగువ అబ్బవరం, శిబ్యాల గ్రామాల నాయకులు, హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐస్..యాపిల్

● తాటిముంజలతో వేసవిలో ఉపశమనం ● అధికంగా తీసుకోవడం శ్రేయస్కరమంటున్న వైద్యులు



పీలేరు/పీలేరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు ఎర్రటి ఎండలతో ఠారెత్తిస్తున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ, ఉక్కపోత, వడగాల్పులు, చెమట ధారలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. విభిన్న వాతావరణ పరిస్థితులు సృష్టించే ప్రకృతి, వాటిని ఎదుర్కొనే ఉపాయాలనూ బోధిస్తుంది. అలా ఎండల బారి నుంచి తప్పించుకోవడానికి ప్రకృతి తాటిముంజలను ప్రసాదించింది. కేవలం ఎండా కాలంలో మాత్రమే దొరికే ఇవి ఎండ వేడిమి నుంచి కాపాడడమే కాకుండా అనేక ఆరోగ్య గుణాలు కూడా కలిగి ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. చూడడానికి జెల్లీలా, నోటిలో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే వీటి లోపలి భాగంలో నీరు ఉంటుంది. అందువల్ల శరీరానికి చలువ చేస్తుంది. అందుకే వాటిని 'ఐస్ యాపిల్' అని పిలుస్తారు. ఎండా కాలంలో తాటి ముంజలను అధికంగా తీసుకోవడం ద్వారా వడదెబ్బతో పాటు అనేక అనారోగ్య సమస్యల నుంచి తప్పించుకోవచ్చునని వారు తెలిపారు. గత మూడు రోజులుగా ఇవి పీలేరు ప్రాంతంలో పెద్దఎత్తున దొరుకుతున్నాయి. పీలేరు పరిసర ప్రాంతాల్లో తాటి చెట్లు లేకపోయినప్పటికీ పొరుగునే ఉన్న చిత్తూరు జిల్లా ఐరాల, పూతలపట్టు మండలాల్లోని పలు ప్రాంతాల నుంచి పలువురు మహిళలు, వ్యాపారులు వాటిని పీలేరులో విక్రయిస్తున్నారు. డజన్ తాటి ముంజలు రూ.70 నుంచి రూ.100 చొప్పున అమ్ముతున్నామని వారు తెలిపారు.



పీలేరులో తాటిముంజలను విక్రయిస్తున్న వ్యాపారులు

అనేక ఆరోగ్య ప్రయోజనాలు...

● వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి తాటిముంజలు ఎంతగానో ఉపయోగపడతాయి. వాటిలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల వాటిని తింటే అధిక దాహార్తి తగ్గుతుంది. వడదెబ్బ నుంచి తప్పించుకోవచ్చు. శరీర ఉష్ణోగ్రతను అదుపులో పెడతాయి. శరీరం డీహైడ్రేట్ కాకుండా కాపాడుతాయి.

● వీటిలో ఎక్కువ తేమ, తక్కువ కొవ్వు ఉండడంతో అవి త్వరగా జీర్ణమై అసిడిటీ, పొట్ట ఉబ్బరం తగ్గి జీర్ణప్రక్రియను సజావుగా చేస్తాయి. చిన్నారులు, హృద్రోగులు, షుగర్ కలిగిన వారు, అధిక బరువుతో బాధపడే వారికి ఇవి ఎంతగానో మేలు చేస్తాయి.

● తాటిముంజలో ఎక్కువగా ఉండే పొటాషియం బీపీని కంట్రోల్ చేస్తుంది. తద్వారా గుండె జబ్బులను నివారిస్తుంది. అంతేకాకుండా శరీరంలోని హానికర వ్యర్థాలను బయటకు పంపడంతో పొటాషియం ఎంతగానో సహాయపడుతుంది.

● దొరికినంత కాలం తాటిముంజలను క్రమం తప్పకుండా తినడం వల్ల శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. తద్వారా లివర్ సమస్యలను అధిగమించవచ్చు.

● తాటి ముంజలు మహిళలకు ప్రకృతి ప్రసాదించిన వరం లాంటివి. వారిలో ఎక్కువగా కనిపించే రొమ్ము క్యాన్సర్ రాకుండా చూడడంతో తాటిముంజలు అద్భుతంగా పనిచేస్తాయని వైద్యులు చెబుతున్నారు. రొమ్ము క్యాన్సర్ కారక పెట్రో కెమికల్స్, ఆంథోసైనిన్ లాంటి వాటిని నిర్మూలిస్తాయని అనేక అధ్యయనాలు వెల్లడించాయి.

● ఎండ కారణంగా తరుచూ బయట తిరిగే వారిలో కనిపించే వికారం, వాంతులను ముంజలు నివారిస్తాయి. వేసవిలో వచ్చే చికెన్ పాక్స్(అమ్మవారు)ను కూడా నివారించవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

● వేసవిలో ఎక్కువ సమయం ఆరుబయట ఆడుకునే చిన్నారుల్లో కనిపించే దద్దుర్లు వంటి చర్మ సమస్యలను సైతం తాటి ముంజలు తగ్గిస్తాయని వైద్య శాస్త్రం చెబుతోంది. దద్దుర్లపై తాటిముంజలతో మర్దన చేస్తే అవి మాయమైపోతాయి. వీటితోపాటు అధిక బరువు, గర్భిణీ, బాలింత మహిళలు, నెలసరి ఇబ్బందులు వంటి అనేక సమస్యలకు తాటిముంజలు బాగా పనిచేస్తాయని, వాటిని అధికంగా తీసుకోవాలని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు.

ప్రకృతి ప్రసాదించిన వేసవి వరం



వేసవి ఇబ్బందుల నుంచి తప్పించుకునేందుకు ప్రకృతి మనకు ప్రసాదించిన వరం తాటిముంజలు. ఎంఎన్‌సీలకు చెందిన కూల్‌డ్రింక్స్ తాగే బదులు సహజసిద్ధంగా వచ్చే తాటిముంజలను తినడం ఎంతో మేలు. వాటిలో ఉండే ఔషధ గుణాలు తెలుసుకునే మన పూర్వీకులు వాటిని ఎక్కువగా తినమని సూచించారు. అయితే ఆధునికీకరణ పేరుతో మనలో చాలా మంది వాటి వైపు చూడడం లేదు. రోడ్డు పక్కన అతిచవకగా దొరికే ముంజలలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటిని చిన్నచూపు చూడకుండా అవి ఎంత కాలం దొరుకుతాయో అంతకాలం తింటే మంచిది. అప్పుడే మనం ఎండల నుంచి ఉపశమనం పొందగలం.

-డాక్టర్ పవన్‌కుమార్, చిన్నపిల్లల వైద్యుడు, పీలేరు

హార్సిలీహిల్స్ విహారయాత్రలో విషాదం

● గంగోత్రి కొలనులో యువకుడి గల్లంతు

● ఆచూకీ కోసం పోలీసుల విఫలయత్నం



గంగోత్రిలో గల్లంతైన బాలు (ఫైల్)

బి.కొత్తకోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో మంగళవారం విషాదకర సంఘటన జరిగింది. ఓ యువకుడు ఘాట్‌రోడ్డులోని గంగోత్రిలో గల్లంతయ్యాడు. సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపిన వివరాల మేరకు. బి.కొత్తకోట పట్టణంలోని జయశ్రీ కాలనీకి చెందిన దేశుగారి బాలక్రిష్ణ (29) దిగువబస్టాండులో ఉన్న ఆంజనేయస్వామి గుడి ఎదుట టైలర్‌షాప్ నిర్వహించుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. అవివాహితుడైన బాలు మంగళవారం బి.కొత్తకోటకు చెందిన తన ఇద్దరు స్నేహితులతో కలిసి సరదాగా హార్సిలీహిల్స్‌కు విహారయాత్రకు వెళ్లాడు. సాయంత్రం వరకు సరదాగా సెల్ఫీలు దిగుతూ గడిపారు. హిల్స్ ఘాట్‌రోడ్డు పక్కన వున్న నీటికొలను అయిన గంగోత్రిలో దిగి ఈతకొడుతూ నీటమునిగి గల్లతయ్యాడు. తోడుగా వచ్చిన మిత్రులు భయభ్రాంతులై అందుబాటులో ఉన్న పర్యాటకులను పిలిచి సాయం అడిగారు. ఎవరు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. పోలీసులకు సమాచారం అందగానే సిబ్బంది, ఈతగాళ్లను, అగ్నిమాపక సిబ్బందిని తీసుకొని సంఘటనా స్థలానికి వెళ్లి బాలు ఆచూకీ కోసం ప్రయత్నించారు. చీకటిలో చేసేదిలేక వెనుదిరిగారు. బుధవారం ఉదయం బోట్లను, గజ ఈతగాళ్లను రప్పించి, యువకుడి ఆచూకీ కోసం ప్రయత్నించనున్నట్లు సీఐ తెలిపారు. బాలు గల్లంతైన వార్తతో బి.కొత్తకోట జయశ్రీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రామసముద్రంలో కార్డెన్‌సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

● 20 ద్విచక్రవాహనాలు సీజ్

రామసముద్రం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాజుల నగరంలో మంగళవారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ సత్యనారాయణ ఎస్ఐలు రవికుమార్, దిలీప్‌కుమార్, తిప్పేస్వామి, పోలీస్ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగా లేని 20 ద్విచక్రవాహనాలు, ఒక టాటా ఏస్ వాహనాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించొద్దని కోరారు. ప్రమాదాల బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. గ్రామాల్లోని కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రెడ్డెప్ప నాయుడు మృతదేహం

బి.కొత్తకోట ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బడికాయలపల్లె పంచాయతీ జింకలదాట్లపల్లెకు చెందిన గాలివీటి నరసింహులునాయుడు కుమారుడు రెడ్డెప్ప నాయుడు (45) ఇటీవల టమోటా పంట సాగు చేశాడు. గిట్టుబాటు ధరలు లేకపోవడం, పాడి ఆవులు సైతం సక్రమంగా పాలు ఇవ్వకపోవడంతో కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చే మార్గం లేకపోవడం, రుణదాతలు ఇంటి వద్దకు తిరుగుతుండడంతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి బి.కొత్తకోట పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని పరిశీలించి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేసి విచారణ చేస్తున్నట్లు బి.కొత్తకోట సీఐ జీవన్ గంగానాథ్ బాబు తెలిపారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

● మే 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాల డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) కోర్సులో ప్రవేశానికి డీఈఈ సెట్-2025 నోటిఫికేషన్‌ను రాష్ట్ర విద్యా శాఖ మంగళవారం విడుదల చేసింది. అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 29 నుంచి మే 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను మే 8వ తేదీలోగా అందజేయాలన్నారు. అలాగే హాల్ టికెట్లు మే 20వ తేదీ విడుదల అవుతాయని, డీఈఈ సెట్ పరీక్షలు జూన్ 2, 3వ తేదీల్లో ఉంటాయన్నారు. అలాగే డైట్ సెట్ పరీక్షా ఫలితాలు జూన్ 10వ తేదీ విద్యా శాఖ విడుదల చేస్తుందన్నారు. పరీక్షా కేంద్రాల ఎంపిక, అభ్యర్థుల అర్హతల నిబంధనలు, కోర్సు ఎంపిక విధానం వంటి పూర్తి సమాచారం కొరకు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన తెలియజేశారు. ప్రాథమిక విద్యకు నాణ్యతను తీసుకొచ్చే భవిష్యత్ టీచర్లకు ఇది మంచి అవకాశం అని, ఒక్క అభ్యర్థి సకాలంలో దరఖాస్తు చేసుకొని పరీక్షకు సన్నద్ధం కావాలని ఆయన కోరారు.

హామీల అమలేదీ : ఈశ్వరయ్య

కడప (సెవెన్‌రోడ్స్), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఎన్నికల వాగ్దానాలు, సూపర్‌సిక్స్ పథకాలు అమలుకు నోచుకోలేదని మంగళవారం కడపలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తానని ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల్లో ప్రకటించిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ పాల్గొన్నారు.

జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేస్తాం

● కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



జిల్లా ఉద్యానశాఖ సమ్మేళనంలో మాట్లాడుతున్న కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, చెన్నూరుకు చెందిన పసుపు రైతు బాలచంద్రను, కామనూరుకు చెందిన రైతు రాఘవరెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుట్టాసుధాకర్ యాదవ్, వరదరాజులరెడ్డి, ఆదినారాయణరెడ్డి

సీకేదిన్నె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేస్తామని, ఉద్యాన పంటల సాగుతో రైతులకు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు చేకూరుతాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. జిల్లా రైతులను ఉద్యాన సాగులో ప్రోత్సహించే దిశగా మంగళవారం స్థానిక రాయచోటి రోడ్డులోని మాధవీ కన్వెన్షన్ హాలులో జిల్లా ఉద్యానశాఖ సమ్మేళనాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా అరటి, చీనీ, పసుపు, ఉల్లిగడ్డ తదితర పంటలను జిల్లా ఉద్యాన గ్రోత్ ఇంజక్షన్‌గా గుర్తించామన్నారు. ఈ పంటలను రాష్ట్రం, దేశం దాటి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందేలా చేస్తున్నామన్నారు. మన జిల్లాలో పండిన అరటి పంటకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు, ఆదరణ లభించడం మన జిల్లాకు గర్వకారణమన్నారు. పండించిన పంటకు సరైన ధర లభించడంలేదనే అంశాలపై మార్కెటింగ్ నిపుణులతో చర్చించామన్నారు. కడప జిల్లా ఉద్యాన ఉత్పత్తులను బ్రాండింగ్ చేయడం, ప్రచారం కల్పించడం, కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటు మౌలిక సదుపాయాలు కల్పించడం, మార్కెట్‌లో పోటీ తత్వం పెంచడం, రైతులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో అవగాహన పెంపొందించడం రైతుకు ఆదాయం రెట్టింపు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

ఏపీఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ కడప జిల్లా హార్టికల్చరల్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్ర హార్టికల్చర్, సెరీకల్చరల్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే 10-15 సంవత్సరాల్లో వ్యవసాయం, ఫిషరీష్, అనిమల్, సెరీకల్చలర్, ఉద్యానశాఖ లాంటి అనుబంధ సంస్థలు చాలా అవసరమన్నారు. రైతులు ఉద్యాన సాగు ఆచరిస్తూ ప్రకృతి వ్యవసాయంలోకి మారాలన్నారు.

కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ ఉద్యాన పంటలకు అపారమైన అవకాశాలు, సదుపాయాలు ఉన్నాయని, ఉత్పత్తులు నిలువ చేసుకునేందుకు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని అన్నారు.. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ కడప ఉద్యాన పంటలు ప్రపంచ వ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు తెచ్చుకోవాలని, అందుకు అవసరమైన సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ అధికారులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి రైతులకు ప్రభుత్వ పథకాలు తెలియజేయాలన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో కోల్డ్ స్టోరేజీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల అవసరం ఎంతైనా ఉందన్నారు.

నిమ్మ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మధుమతి మాట్లాడుతూ జిల్లాలో వాటర్ రీసోర్స్ ఎంతో అనుకూలంగా, ఆశాజనకంగా ఉన్నాయన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుకు జిల్లాలో విపరీతమైన అవకాశం ఉందని, జిల్లాను హార్టికల్చలర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఉద్యాన పంటల సాగులో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా సహజ పద్ధతిలో పసుపు సాగుచేస్తున్న చెన్నూరుకు చెందిన ఆదర్శ రైతు కె.బాలచంద్రను, బహుళ పంటలను సాగుచేస్తున్న కామనూరుకు చెందిన ఆదర్శ రైతు రాఘవరెడ్డిలను అధికారులు సత్కరించారు. అంతకుముందు అధికారులు, ప్రజాప్రతినిధులు ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ అదితి సింగ్, అనంతరాజుపేట ఉద్యాన కళాశాల హెచ్‌వోడీ శివప్రసాద్, రాజానాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ అధికారి శారదమ్మ, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు ఆనంద్‌నాయక్, కిరణ్‌కుమార్, హార్టికల్చరల్ అధికారి జ్యోతిర్మయి, మార్కెటింగ్, ఉద్యాన సంబంధిత అధికారులు, రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి బంగారు ఆభరణాలు

● తయారు చేయించి ఇచ్చిన దాతలు, కమిటీ సభ్యులు

● జాతర రోజు అమ్మవారికి ఆభరణాల అలంకరణ



బంగారు కిరీటం, మాంగ చంద్రహారం, సూర్యవంక

రైల్వేకోడూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గంగమ్మతల్లికి దాతలు, కమిటీ సభ్యులు కలిసి బంగారు ఆభరణాలను తయారు చేయించారు. అమ్మవారి జాతర ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమౌతాయి. గురువారం జాతర నిర్వహించి, శుక్రవారం నిమజ్జనంతో జాతర ముగుస్తుంది. గంగమ్మకు మండలంలో చాలా మంది దాతలు బంగారు ఆభరణాలు చేయించడానికి ముందుకు వచ్చారు. లక్షలాది రూపాయల చందాలు వచ్చాయి. దీంతో మొదటిగా ఈ ఏడాది అమ్మవారికి బంగారు కిరీటం, తర్వాత రెండు బంగారు హస్తాలు, సూర్యవంక, మాంగచంద్రహారం, పుష్పహారం తయారు చేయించారు. అదే విధంగా పోతులరాజు విగ్రహాన్ని దాతలు తయారు చేయించి ఇచ్చారు. బుధవారం అర్ధరాత్రి మట్టితో గంగమ్మ ప్రతిమను తయారు చేస్తారు. అనంతరం అమ్మవారికి బంగారు ఆభరణాలను అలంకరిస్తామని జాతర నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి బంగారుతో జడకుచ్చులు తయారు చేయించారు. ప్రస్తుతం జరుగుతున్న జాతర వందేళ్లు పూర్తి కావడంతో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హోటళ్లు, మాంసం దుకాణాల్లో తనిఖీలు



హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు షమీమ్‌బాషా, వెంకటసుబ్బయ్య

మదనపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాంసం దుకాణాలతో పాటు వివిధ హోటళ్లను మంగళవారం ఆహార భద్రత అధికారి కె.షమీమ్‌బాషా, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటసుబ్బయ్య తనిఖీ చేశారు. బెంగ ళూరు బస్టాండు, అంబేద్కర్ సర్కిల్, ఎన్‌టీ ఆర్ సర్కిల్ ఏరియాలోని వివిధ హోటళ్లతోపాటు దర్నీపేట, నీరుగట్టు వారిపల్లె, బెంగళూరు బస్టాండు, రామా రావుకాలనీ ఏరియాలలో మటన్, చికెన్ దుకాణాలను పరిశీలించారు. ఎక్కువ రోజులు ఫ్రిజ్‌లో ఉంచిన మటన్, చికెన్‌లను ఆహార ప దార్థాలుగా వాడరాదని సూచించారు. వీటిని కస్టమర్లకు పెడితే అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కూరలు, చికెన్, మటన్ వంటకాలకు పదేపదే వాడిన ఆయిల్‌ను ఉపయోగిస్తే జీర్ణకోశ, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వచ్చే అవకాశముందన్నారు. హోటళ్లు, చికెన్, మటన్ షాపులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లైసెన్సులు ఎప్పటికప్పుడు రెన్యువ ల్ చేసుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆహార భద్రతశాఖ సీనియర్ అసిస్టెంట్ పి.సీతారామయ్య, మున్సిపల్ మేస్త్రీ రెడ్డెప్ప, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండకు నిప్పు..

మంటలను ఆర్పేసిన అటవీ సిబ్బంది



భాకరాపేట బీట్ పాలకొండలో మంటలను ఆర్పేస్తున్న అటవీ సిబ్బంది

సిద్దవటం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కడప రేంజ్ అటవీశాఖ పరిధి సిద్దవటం మండలం భాకరాపేటబీట్ పాలకొం డ అడవికి సోమవారం రాత్రి ఆకతాయిలు నిప్పు పెట్టడం తో కడప ఫారెస్ట్ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను ఆర్పేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎఫ్‌బీవో ఇందిర, రాజశేఖర్‌రాజు, భానుకిషోర్, ప్రొటక్షన్ వాచర్లు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ వికాస్

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పీటీఎంకు చెందిన దొరిగుండ్ల వికాస్ (18) బైక్‌పై బి.కొత్తకోట నుంచి స్వగ్రామానికి వస్తుండగా బాంబే ఎస్టేట్ సమీపంలో అదుపు తప్పి కింద పడిపోయాడు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతనిని స్థానికులు 108 వాహనంలో బి..కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

కోడూరు యువకుడు తిరువళ్లూరులో ఆత్మహత్య

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోడూరు పట్టణానికి చెందిన యువకుడు ఎం.ప్రతాప్ (30) సోమవారం రాత్రి తమిళనాడు రాష్ట్రంలోని తిరువళ్లూరులో ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రతాప్ తిరువళ్లూరులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ప్రతాప్ మృతిపై కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో హుటాహుటిన బంధువులు తిరువళ్లూరుకు తరలివెళ్లారు. అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్షలు నిర్వహించి అనంతరం మృతదేహాన్ని కోడూరుకు తరలించారు.

కోడిపందెం ఆడుతున్న ఏడుగురి అరెస్టు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోడిపందెం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మదనపల్లె పట్టణం రామిరెడ్డి లేఅవుట్‌లో కోడిపందెం ఆడుతన్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసినట్లు ఆయన వివరించారు.

నలుగురు మట్కాబీటర్ల అరెస్టు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని సంజీవనగర్‌లో మట్కా ఆడు తున్న నలుగురు వ్యక్తులను టూటౌన్ సీఐ సదాశివయ్య అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.26,500 నగదుతో పాటు మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో వాజ్‌పేయ్ నగర్‌కు చెందిన కాకి కుళాయప్ప, సంజీవనగర్‌కు చెందిన బండారు లక్ష్మీనారాయణ, బండారు శ్రీనాథ్, అంకట రాముడులు ఉన్నారు. వీరందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాలికను గర్భిణీని చేసిన వ్యక్తిపై పోక్సో కేసు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషను పరిధిలోని ఒక సప్లయిర్స్ దుకాణంలో పనిచేస్తున్న వ్యక్తి హోటల్లో పనిచేస్తున్న బాలికకు మాయమాటలు చెప్పి గర్భిణీని చేశాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి పంపగా ఆరు నెలల గర్భిణిగా వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం.

నేల ఆరోగ్యం.. రైతు సౌభాగ్యం

- ఖరీఫ్‌కు ముందే మట్టి పరీక్షలు
- జిల్లాలో 24,288 నమూనాల సేకరణే లక్ష్యం
- గత అయిదేళ్లలో అరకొరే
- ప్రభుత్వంపై రైతుల ఆశలు



మట్టి నమూనాలను పరిశీలిస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పొలంలో మంచి పంట పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో ప్రధాన పోషకాలు అయిన నత్రజని, భాస్వరం, పొటాష్, పరిమాణాల్లో మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. భూమిలో ఏయే పోషకాలు క్షీణించాయి, తదితరాలు వెలువడుతాయి. ఇంతటి కీలకమైన సమాచారం అందించే భూసార పరీక్షలను గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు ముందే మట్టి పరీక్షలు చేయించాలని నిర్ణయించారు. 2025-26 ఏడాదికి కడపజిల్లాలో 24,288 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. పోషకాలతో అధిక దిగుబడులు, భూసారం భద్రంగా ఉన్నప్పుడే మొక్కల ఎదుగుదల ఉంటుంది. తద్వారా దిగుబడి నాణ్యంగా ఉండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో ప్రధాన పోషకాలు అయిన ఉదజనిసూచిక, లవణ పరిమాణం, నత్రజని, భాస్వరం, పొటాష్ లభించే మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. రసాయనిక ఎరువుల వాడకం జరిగిందని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. పంటల సాగుకు తగిన నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు భూసార పరీక్ష ఫలితాల మేరకు పోషకాలను అందించి దిగుబడులు పొందవచ్చు.

సేకరణ ఇలా...

సాంప్రదాయ పద్ధతులను పక్కనపెట్టి సాంకేతిక దిశగా అడుగులు వేసేలా రైతన్నలను వెన్నుతట్టి ప్రోత్సహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కడపజిల్లాలో 17,800 అన్నమయ్య జిల్లాలో 16,500 మట్టి నమూనాలను సేకరించారు. ప్రస్తుతం జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 24,288 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ నెల 15 నుంచి మే 15 వరకు ఈ సేకరణలను పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. వ్యవసాయ శాఖ కడప డివిజన్ పరిధిలో 3,366, కమలాపురం 3,300, పులివెందుల 3,696, ముద్దనూరులో 2,674, ప్రొద్దుటూరు 3,102, మైదుకూరు 2,904, బద్వేలు 1,814, పోరుమామిళ్ల 3,432 మొత్తం 36 మండలాల్లో 368 రైతు సేవా కేంద్రాల పరిధిలో 24,288 నమూనాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కడప, కమలాపురం, పులివెందుల, బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని 19 మండలాల్లోని 12,176 నమూనాలను సంచార భూసార పరీక్షల వాహనం (ఎంఎస్‌టీఎల్) ద్వారా విశ్లేషణ చేయాల్సి ఉంది. ముద్దనూరు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పోరుమామిళ్ల డివిజన్లలోని 17 మండలాల పరిధిలో 12,112 మట్టి నమూనాలను ఊటుకూరు భూసార పరీక్షల కేంద్రానికి (ఎస్‌టీఎల్) పంపించాలి.

పకడ్బందీ ప్రణాళికతో....

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఖరీఫ్ సీజన్ మొదలయ్యేనాటికి భూసారానికి సంబంధించిన ఫలితాలు అందించేలా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రబీ సీజన్ పూర్తవడంతో భూసార పరీక్షలు చేసేందుకు అనువైన సమయం లభించింది. ఈ క్రమంలో జిల్లాలో మట్టి నమూనాల సేకరణ, తరలింపు, పరీక్షించడం, ఫలితాలను రైతులకు అందించే కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. దీంతోపాటు రైతులకు ఆరోగ్యకార్డులను సైతం అందించనున్నారు. ఇందులోనే పరీక్షా ఫలితాలను పొందుపరచనున్నారు. ఫలితంగా వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

> **రైతు అవగాహన కలిగి ఉండాలి**
>
> జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. భూసార పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పారదర్శకత కోసం ఎస్‌హెచ్‌సీ యాప్ ఆధారిత సేవలు అనుసంధానం చేస్తున్నాం. రైతు
>
> పొలాల నుంచి నమూనాలను సేకరించి త్వరితగతిన పరీక్షలు చేసి సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించి రైతులను అప్రమత్తం చేస్తాం.
>
> - రాధాదేవి, ఏడీ, ఊటుకూరు భూసార పరీక్ష కేంద్రం

నమోదుకు ప్రత్యేక యాప్

నేలను బట్టి అయిదారు ఎకరాలకు ఒక నమూనాను సేకరించవచ్చు. నమూనా తీసే పొలంలో 10 నుంచి 20 చోట్ల మట్టిని సేకరించాలి. పారతో వి ఆకారంలో 6 నుంచి అంగుళాల గుంత తవ్వాలి. అందులోని మట్టిని పాలిథిన్ సంచిలో ఉంచి బాగా కలపాలి. ఆ మట్టిని నాలుగు భాగాలుగా విభజించి ఎదురెదురుగా ఉన్న భాగాలను తీసుకుని అరకిలో మట్టిని తీసేకుని పరీక్షకు పంపాలి. జిల్లా వ్యాప్తంగా గతంలో నిర్వహించిన పరీక్షల్లో ప్రధానంగా సేంద్రిక కర్బనం, నత్రజని, జింక్, ఐరన్ లోపాలను గుర్తించారు. తాజాగా భూసార పరీక్షలు చేపడితే భూమిలో నత్రజని, బోరాన్, జింక్, ఇనుము, పొటాష్, భాస్వరం, ఇతర సూక్ష్మపోషకాలు ఎంతమేరకు ఉన్నాయో తెలుస్తుంది. ఈసారి పక్కాగా పరీక్షించేందుకు ఎస్‌హెచ్‌సీ యాప్‌ను తీసుకొచ్చారు. పొలంలో మట్టి నమూనా సేకరణ స్థలం కనిపించే లా రైతులతో సెల్ఫీ తీసుకుని ఫోటో భద్రపరచాలి.



ల్యాబ్‌కు తరలించేందుకు సేకరించిన నమూనాతో ఏవో శివశంకర్‌రెడ్డి

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థి ప్రతిభ



విద్యార్థి సుబ్బారెడ్డిని అభినందిస్తున్న ఎంఈవో సునీత

చెన్నూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నిర్వహించిన క్రీడా పోటీల్లో చెన్నూరుకు చెందిన బసిరెడ్డి సుబ్బారెడ్డి అనే విద్యార్థి ప్రథమ బహుమతి అందుకున్నారు. ఈ మేరకు స్థానిక మం డల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో-2 సునీత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నాదేవి, పద్మనాభం, రమణయ్య, ఉమామహేశ్వరి, అరుణ కుమార్‌లతో అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఈ నెల 21, 22, 23 తేదీల్లో విజయవాడలో ప్రత్యక అవసరాలు గల పిల్లలకు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో చెన్నూ రు భవిత సెంటరు నుంచి సుబ్బారెడ్డి పాల్గొని.. వంద మీటర్ల రన్నింగ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం, 200 మీటర్ల రన్నింగ్‌లో మూడో బహుమతి గెలుచుకున్నారని తెలిపారు. ఈ విద్యార్థి ఇటీవల వచ్చిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణలయ్యారని తెలిపారు. ఈఆర్‌టీ ఎమ్మార్సీ సిబ్బంది గురవయ్య పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం


కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిక అధికారి కె.సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడో తరగతికి సంబంధించి ఆంగ్ల మాధ్యమంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని వర్గాల వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు సంబంధించి గిరిజనులు మాత్రమే ప్రవేశానికి అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు సంక్షేమ గురుకుల పాఠశాల కడప, పులివెందుల, మైదుకూరు, పోరుమామిళ్లలో సంప్రదించాలని కోరారు. ఆసక్తి ఉన్న అర్హులైన విద్యార్థులు అడ్మిషన్ల కోసం మే 1వ తేదీ నుంచి 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పాఠశాలలోని ఖాళీల కంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వస్తే మే 30వ తేదీ గిరిజన సంక్షేమ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని ఆమె వివరించారు.

సామాజిక అంశాలపై యువతకు అవగాహన

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ ద్వారా యువతకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారి క అధికారి డి.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫ రెన్స్‌లో ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామం, వార్డుల్లో కిశోర బాలికలకు ముఖ్యంగా 15 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు కలిగిన అమ్మాయిలకు గ్రూప్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారంలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తూ అంగన్వాడీ వర్కర్స్, వీఓహెచ్‌లు కలిసి దాదాపు 12 అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయించినట్లు వివరించారు. ఈ మేరకు షెడ్యూల్ ప్రకారం మే 2 నుంచి జూన్ 10 వరకు ఈ సమ్మర్ క్యాంప్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎం, మండల డెవలప్‌మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి వెల్లాల బ్రహ్మోత్సవాలు





వెల్లాల సంజీవరాయస్వామి , చెన్నకేశవస్వామి

రాజుపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అతి పురాతన పుణ్యక్షేత్రమైన వెల్లాల సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను మే 8 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రమణ తెలిపారు. ఆ మేరకు మంగళవారం బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఈవో ఆవిష్కరించారు. ఇందులో భాగంగా మే 8న (గురువారం) అంకురార్పణ, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 9న (శుక్రవారం) శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం, 11న (ఆదివారం) హనుమంతోత్సవం, 12న (సోమవారం) గరుడోత్సవం, నట రాజకళాక్షేత్రం ప్రొద్దుటూరు వారిచే సాంస్కృతిక నృత్య ప్రదర్శన, 14న (బుధవారం) రథోత్సవం, 16న స్వామివార్ల చక్రస్నానం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్స వాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి, గంగిరెడ్డి, మండల టీడీపీ నేత సుబ్బిరెడ్డి, ఆలయ మాజీచైర్మన్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పట్టించుకోడు...ప్రభుత్వం పట్టించుకోదు

- డిప్యూటీ సీఎంకు తులసిరెడ్డి లేఖ

వేంపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీని ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పట్టించుకోడు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్.తులసిరెడ్డి అన్నారు. సమస్యల వలయంలో చిక్కుకున్న వేంపల్లె మేజర్ పంచాయతీ గురించి డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు తులసిరెడ్డి లేఖ రాశారు. అందులో వేంపల్లె మురికికూపంగా తయారైందని.. దాదాపు 60వేల జనాభా ఉంటుందని.. గత మార్చి 5వ తేదీ ఈఓను ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. ఈఓఆర్డీని బదిలీ చేసిందని, అప్పటి నుంచి ఈఓ, ఈఓఆర్డీలు లేరన్నారు. అవినీతి ఆరోపణలు, రాజకీయ జోక్యంతో భయపడి ఎవరూ రావడం లేదన్నారు. వాటర్ స్కీమ్ సిబ్బందికి ఆరు నెలలుగా, గ్రామ సచివాలయ సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు లేవు, పారిశుధ్యం అధ్వాన్నంగా తయారైంది.. తాగునీటి సమస్య జఠిలమైంది... ఇలా పంచాయతీకి సంబంధించి అనేక సమస్యలతో సతమతవం అవుతోందని.. వెంటనే ఈఓ, ఈఓఆర్డీలను నియమంచాలని కోరారు.

ఇందిరకు వైవీయూ డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పరంగా లభించే సాధారణ ప్రారంభ పదార్థాలు, పర్యా వరణ అనుకూల సింథటిక్ పద్ధతులను ఉపయోగించి మల్టీ ఫంక్షల్ ఆర్గానిక్ పదార్థాలను కనుగొన్నందుకు వైవీ యూ పీజీ కళాశాల రసాయన శాస్త్ర శాఖ స్కాలర్ ఎం.ఇందిరకు యోగివేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు పి.వసు గోవర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో డెవలప్‌మెంట్ ఆఫ్ సస్టైనబుల్ ఆర్గానిక్ సింథటిక్ ప్రొటోకాల్స్ ఎంప్లాయింగ్ అయానిక్ లిక్విడ్స్, బెమ్మిడజోలియం సాల్ట్స్ అండ్ అల్ట్రాసోనిక్ ఇర్రే డియేషన్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. పరిశీలించిన నిపుణుల బృందం థీసిస్‌కు డాక్టరేట్ అర్హత ఉన్నట్లు ప్రకటించారు.

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఇకపై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

సింహాద్రిపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు ప్రాంతీయ బ్యాంకులు విలీనం అయినట్లు సింహాద్రిపురం ఏపీజీబీ మేనేజర్ కృష్ణకిషోర్, ఫీల్డ్‌ఆఫీసర్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ విలీనం అయ్యాయని తెలిపారు. ఈ నాలుగు బ్యాంకులు విలీనం అయి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా అవతరించినట్లు తెలిపారు. విలీనం అయినప్పటికీ ఖాతా నెంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు లేదా బ్రాంచ్‌చిరునామాలతో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు లేదని ఖాతాదారులకు తెలియజేశారు.

ఆరాధనోత్సవాలకు ప్రత్యేక బస్సులు

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్ర స్వాముల ఆరాధనోత్సవాలకు మైదుకూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు మంగళవారం డిపో మేనేజరు శ్రీరాం కుమార్ తెలిపారు. ఆరాధనోత్సవాలకు 6వ తేదీ మధ్యాహ్నం నుంచి 8వ తేది రాత్రి వరకు బస్సులను నడపనున్నట్లు తెలిపారు. అలాగే మైదుకూరు నుంచి మిట్టమానుపల్లె మీదుగా బ్రహ్మంగారిమఠం, పోరుమామిళ్ల, జ్యోతి క్షేత్రానికి కూడా బస్సులను నడపనున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



సింహాద్రిపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవరంగుట్టపల్లెకు చెందిన గోపాలదాస్ ఆశీర్వాదం (19) అనే యువకుడు కడుపునొప్పి తాళలేక మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిసిన సమాచారం మేరకు.. ఆశీర్వాదం గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుడేవాడు. పలు ఆసుపత్రులలో చికిత్స తీసుకున్నా ఫలితం లేకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని అన్న సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్ర మోహన్‌రెడ్డి తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



అట్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురాయపల్లె జంగముకుంట వద్ద నాగదాసరి దేవేంద్ర (35) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు. గోపవరం మండలం ఎస్.రామాపురం హరిజన వాడకు చెందిన దేవేంద్రకు మతిస్థిమితం లేదు. దీంతో వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తప్పిపోయాడు. ఈ మేరకు మృతుడి తండ్రి నాగదాసరి తిరుపాలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో గోపవరం అట్లూరు మండలాల మధ్య అటవీ ప్రాంతమైన సూరా యపల్లె సమీపంలో మృతదేహం ఉన్నట్లు గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంళవారం సాయం త్రం ఎస్‌ఐ రామక్రిష్ణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కడుమూరు లక్ష్మిదేవి నేత్రదానం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం కచేరి రోడ్డులోని నాగయ్య ఆశ్రమంలో ఉంటున్న కడుమూరు లక్ష్మిదేవి (50) మంగళవారం మరణించడంతో ఆశ్రమం నిర్వాహకులు నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు లక్ష్మీదేవి పార్థీవదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు.

10 నుంచి నారాపురం వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న నారాపురం వెంకటేశ్వరస్వామి దేవాలయం

జమ్మలమడుగు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో వెలసిన నారాపురం వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 10వ తేదీ అంకురార్పణతో ప్రారంభం అవుతాయని ఆలయ అధికారి మోహన్ తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఉత్సవాల ప్రకటనను అధికారులతో కలిసి విడుదల చేశారు. అందులో భాగంగా మే 10వ తేదీ శనివారం అంకురార్పణతో బ్రహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 11న ధ్వజారోహణం, సాయంత్రం పెద్ద శేష వాహనం, 12న చిన్న శేష వాహనం, సాయంత్రం హంసవాహనం, 13న ముత్యపు పందిరి వాహనం, సాయంత్రం సింహవాహనం, 14న కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమంత వాహనం, 15న మోహినీ అలంకారం, సాయంత్రం గరుడ వాహనం, 16న సర్వభూపాల వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, గజవాహనం, 17న శ్రీనారాపురం వెంకటేశ్వరస్వామి రథోత్సవం ఉంటుందన్నారు.సాయంత్రం అశ్వవాహనంలో ఊరేగింపు, 18న సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 19న చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, 20న సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

వేలంలో సిండికేట్

నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం వివిధ దుకాణాలు, జాయింట్‌వీల్స్ తదితర వాటికి సంబంధించి వేలం నిర్వహించారు. ఓపెన్ టెండర్లకు సంబంధించి 13 మంది డీడీలు కట్టి ఆలయంలో అందజేశారు. టీటీడీకి సంబంధించిన వేలం రూ.10,00,111లతో అధికారులు ప్రారంభించారు. అయితే 13 మంది వేలంపాటదార్లలో పత్తి మహేంద్ర అనే వ్యక్తి మాత్రం పాల్గొని రూ.10.30 లక్షలకు వేలం దక్కించుకున్నారు. అదే 2023లో రూ.15.10 లక్షలు వేలం ద్వారా టీటీడీకి ఆదాయం వచ్చింది. 2024లో ఎన్నికల కోడ్ ఉన్నందున టెండర్లు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. టీటీడీ డిప్యూటీ డీఈవో నటేష్‌బాబు, జేఈ కళావతి, సూపరింటెండెంట్ హనుమంతు, సిబ్బంది గురుస్వామి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్‌గ్రూప్ ప్రజల స్థితిగతులను గుర్తించాలి

- జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ ఉమా మహేశ్వరకుమార్

కడప, కలెక్టరేట్, ఏప్రిల్ 29,(ఆంధ్రజ్యోతి) హైరిస్క్‌గ్రూపు ప్రజల జీవన స్థితిగతులు తెలుసుకోవాలని జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమా మహేశ్వరకుమార్ పేర్కొన్నారు. మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ సహకారంతో హైరిస్క్ గ్రూప్ ప్రజల స్థితి గతులు, సమాజంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రీ ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈసంద్భంగా డాక్టర్ ఉమా మహేశ్వరకుమార్ హైరిస్క్ గ్రూపుల వారి వివరాలకు సంబంధించి వారి అనుమతితో సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి సగిలి రవిబాబు మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల సర్వేను బాధ్యతగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ డాక్టర్ అనూష, జిల్లా ప్రోగ్రామ్ అధికారి అలీహైదర్, టిన్‌గోస్ ప్రాజెక్ట్ డైరెక్టర్స్, ఏఎన్ఎంలు, మెడికల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కార్మికులకు సెలవు దినంగా ప్రకటించాలి

కడప(వినాయకనగర్), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మేడే సందర్భంగా మే 1వ తేదీ కార్మికులకు సెలవు దినంగా ప్రకటించాలని కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ ఒక ప్రకటనలో ఆయా సంస్థల యాజమాన్యాలను కోరారు. ఆయా దుకాణదారులు, సంస్థల యాజమాన్యాలు ఒక వేళ పని చేయించుకుంటే 30 రోజులలోపు ఒక రోజు సెలవు ఇచ్చి ఆ రోజుకు రెట్టింపు వేతనం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కార్మికులు కింది అధికారుల ఫోన్ నెంబర్లను కడప 9492555204, ప్రొద్దుటూరు 9492555209, కమలాపురం 9492555207, బద్వేల్ 9492555212, పులివెందుల 9492555213ను సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల దీక్షలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాయచోటి డిపో ఎదుట మంగళవారం రెండవ రోజు కూడా ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఎన్ఎంయూ రీజనల్ అధ్యక్షుడు ఎంఎన్‌రావు, కార్యదర్శి పీఎస్ఎం రాజు డిపో ఎదుట రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. రెండవ రోజు రిలే నిరాహార దీక్షల్లో ఉద్యోగులు ఎం. రెడ్డెప్ప, సుధాకర్, హరినాథ, ఎంహెచ్‌నాయుడు పాల్గొన్నారు. అనంతరం నేషనల్ మజ్దూర్‌యూనిటీ అసోషియేషన్ రీజనల్ నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గతంలో అనేక దఫాలుగా ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు, ధర్నా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కారం రాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంఆ రిలే నిరాహార దీక్షల కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. రీజనల్ నాయకులు సీవీ రమణ, ఎంఎస్ ప్రసా ద్, టీ. రామాంజులు, డిపో నాయకులు ఆర్‌వీ గోపాల్, డీఎస్ వాసులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

వాల్మీకిపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డితో పాటు ప్రభుత్వ శాఖల అధికారులందరూ అందుబాటులో ఉంటారన్నారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి



పాలిసెట్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అబ్జర్వర్, కోఆర్డినేటర్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ రాస్తున్న అభ్యర్థులు బుధవారం ఉదయం 9 గంటలకే వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని జిల్లా అబ్జర్వర్ సుధాకర్, అబ్జర్వర్ భక్తవత్సలం, కోఆర్డినేటర్ ఓబులేసు సూచించారు. మంగళవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల, జ్ఞానోదయ హైస్కూల్‌లో పాలిసెట్ నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లెలోని రెండు సెంటర్లలో 1,418 మంది పాలిసెట్ పరీక్షకు హాజరు కానున్నారన్నారు. ఈ రెండు సెంటర్లలో అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా పాలిసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా హెచ్‌బీ పెన్సిల్, పెన్ను తీసుకురావాల్సి ఉందన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహిస్తామని, అంతకు ముందు రెండు గంటలు విద్యార్థులకు పలు సూచనలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకుడు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 3వ తరగతి నుంచి 9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో 3వ తరగతిలో ఎస్టీలకు 32, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీలకు ఒక సీటు ఉందన్నారు. 4వ తరగతిలో ఎస్టీలకు 33, 5వ తరగతిలో ఎస్టీలకు 39, 6వ తరగతిలో ఎస్టీలకు 35, 7వ తరగతిలో ఎస్టీలకు 29, 8వ తరగతిలో ఎస్టీలకు 34, 9వ తరగతిలో ఎస్టీలకు 29 సీట్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. మే 20వ తేదీలోపు పీలేరు-మదనపల్లె మార్గంలోని బోదేషావలి దర్గా వద్దనున్న పాఠశాలకు నేరుగా వచ్చి దరఖాస్తులు అందజేయాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9505336767, 9441494161 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మాజీ ఎంపీపీ రాధమ్మ మృతి



తంబళ్లపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం పరుసతోపు పంచాయతీ బోయపల్లెకు చెందిన మాజీ ఎంపీపీ రాధమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. 2014లో టీడీపీ తరపున ఎంపీటీసీ సభ్యురాలిగా గెలిచి, తంబళ్లపల్లె ఎంపీపీగా పనిచేశారు. రాధమ్మ మృతి పట్ల పలు రాజకీయ పార్టీ నాయకులు, గ్రామస్తులు సంతాపం తెలియచేశారు.

టీడీపీ మైనారిటీ నాయకుడు ముస్తఫా మృతి



కలికిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రముఖ టీడీపీ మైనారిటీ నాయకుడు, జమీయత్ ఉలేమా-ఏ-హింద్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ముస్తఫా హజరత్ (67) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఏడాది కాలంగా తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. క్రాస్ రోడ్డులోని ఈద్గా మసీదు అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. హిందూ ముస్లింల ఐక్యత కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఏటా అయ్యప్ప దీక్షలో వున్న వారికి ఒక రోజు భిక్ష ఏర్పాటు చేసేవారు. టీడీపీ రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.బుధవారంఅంత్యక్రియలు జరుగనున్నాయి.

అలంకారప్రాయంగా చలివేంద్రం

తంబళ్లపల్లె, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో పంచాయతీ వారు ఏర్పాటు చేసిన చలివేంద్రం అలంకార ప్రాయంగా మారింది. ఇరవై రోజుల క్రితం పంచాయతీ సిబ్బంది అట్టహాసంగా చలివేంద్రం వేర్పాటు చేశారు. మొదట్లో కొన్ని రోజులు కుండల్లో నీటిని నింపారు. ఆ తర్వాత నీరు పోయక పోవడంతో కుండలు ఖాళీగా దర్శనమిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

ఆసుపత్రా..? అడవా..?

- ముళ్ల పొదలతో నిండిన ఆవరణ
- రోగులకు విషసర్పాల భయం
- తొలగింపునకు నోచుకోని శిథిల భవనాలు



పిచ్చి మొక్కలతో నిండిన ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణ

నిమ్మనపల్లి ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణ అడవిని తలపిస్తుండడంతో రోగులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆ ఆసుపత్రిలో గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంలో 2018లో అప్పటి ప్రభుత్వం నూతన భవనాన్ని నిర్మించింది. పాత భవనాన్ని అలాగే వదిలేయడంలో ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీనికి తోడు శిథిలావస్థకు చేరుకున్న 108 వాహనాన్ని కూడా పాత భవనం వద్దే వదిలిపెట్టేశారు. అధికారులు అటువైపు కన్నెత్తైనా చూడకపోవడంతో ఆవరణ చుట్టూ చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. వీటన్నిటి మధ్యలో కొత్త ఆసుపత్రి భవనం ఉండడంతో, సిబ్బందితో పాటు ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రజలు రోగులు భయపడుతున్నారు. కాగా, ఈ ఆవరణలోని ఉన్న కంటి ఆసుపత్రిలో డాక్టర్ లేకపోవడంతో దానిని తెరవడం లేదు. దీంతో ఆసుపత్రి చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి. ఇక ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన సిబ్బంది క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నా వాటిని తొలగించక పోవడంతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్లు ఉండగా ఒకరు డెప్యుటేషన్‌పై మదనపల్లి వెళ్లారు. దీంతో ఒక డాక్టరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన చిన్నపాటి కేసులను కూడా మదనపల్లికు రెఫర్ చేస్తున్నారు. దీని కారణంగా ఆసుపత్రికి వచ్చి రోగులకు నర్సులే దిక్కుగా మారారు. దీనిపై వైద్యాధికారి రమేష్‌బాబును వివరణ కోరగా వాహనాలు లోపలికి వెళ్లే అవకాశం లేక పోవడంతో పాత భవనం వద్ద పిచ్చి మొక్కలు తొలగించలేదని, ఆసుపత్రి ఆవరణలో దాదాపు రూ.50 లక్షలతో యాస్పిరేషన్ బ్లాక్ మంజూరైందని దీనికి స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా భూమి చేశారని తెలిపారు. ఆ భవన నిర్మాణ పనులు ప్రారంభమైతే పిచ్చి మొక్కలను తొలగించే అవకాశం లభిస్తుందన్నారు. రోగులను దృష్టిలో ఉంచుకొని మరో డాక్టర్‌ను నియమించాలని, ఆసుపత్రి ఆవణంలో పిచ్చిమొక్కలు తొలగించి విషసర్పాల బారిన పడకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకొన్న 108 వాహనం

ధూప,దీప, నైవేద్యం అమలు తీరు పరిశీలన

- ఆలయాలను సందర్శించిన ఎండోమెంట్ ఏసీ



రామసముద్రంలోని జనార్ధనస్వామి ఆలయాన్ని సందర్శించిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్

రామసముద్రం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ధూప దీప నైవేద్యాలకు నిధులు మంజూరవుతున్న మండలంలోని చెంబకూరు, రామసముద్రం, ఊలపాడు, ఉప్పినెల్లి, ఆర్.నడింపల్లె, వనగానిపల్లె, గుంతయంబాడి, కురిజల, తదితర గ్రామాలలోని ఆలయాలను ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ మంగళవారం సందర్శించారు. పూజ కైంకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూజలతో పాటు ఆలయాలకు సంబంధించిన భూములను కూడా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఆలయ అర్చకులు, కమిటీ మెంబర్లు, గ్రామస్తులపైన ఉందన్నారు. ఆలయాల అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, దేవాలయ భూములు లీజుకు తీసుకున్న రైతులు లీజు మొత్తాన్ని నిర్దేశించిన గడువులోగా చెల్లించాలని, లేకపోతే నోటీసులు జారీ చేస్తామని సూచించారు. గుంతయంబాడిలో ఆలయాల భూముల లీజు వసూలుకు చర్యలు తీసుకుంటామని అర్చకుడు మల్లికార్జున దీక్షిత్ కు తెలిపారు. అనంతరం కురిజలలో నిర్మిస్తున్న చెన్నరాయస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఈవో రమణ, సిబ్బంది రాజేష్, అర్చకులు, రైతులు ఉన్నారు.

క్షయ బాధితుల సన్నిహితులకు పరీక్షలు తప్పనిసరి



అనుమానితులకు సీవైటీబీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కలికిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణకు చికిత్స పొందుతున్న వారి సన్నిహితులు తప్పనిసరిగా సీవైటీబీ (కటానియస్ ట్యూబర్కులిన్) పరీక్ష చేయించుకోవాలని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కావ్యగంధ, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ తెలిపారు. మంగళవారం కలికిరి-2 సచివాలయం పరిధిలో సీవైటీబీ పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. టీబీ రోగుల కుటుంబాల్లో 18 ఏళ్లు పైబడిన వారికి ఈ పరీక్షలు అవసరమని చెప్పారు. కేవలం 0.1 ఎంఎల్ మందును ముంజేతి భాగంలోని చర్మం పొరలలో జొప్పిస్తామని, 48 నుంచి 72 గంటల అనంతరం మందు ఇచ్చిన ప్రదేశంలో ఎర్రటి బొడిపె ఏర్పడితే టీబీ వ్యాధి సంక్రమించిందని నిర్ధారించవచ్చని వివరించారు. ఇలా ఎవరికైతే పాజిటివ్ ఫలితం వస్తుందో వారికి భవిష్యత్తులో టీబీ వ్యాధి తప్పనిసరిగా వచ్చే అవకాశముందని తెలిపారు. దీని నివారణ కోసమే ముందస్తుగా సీవైటీబీ పరీక్షలు నిర్వహించి నిర్ధారణ అయితే కనీసం మూడు నెలలపాటు మందులు తీసుకోవలసి ఉంటుం దన్నారు. అందరు ఏఎన్ఎంల వద్ద ఇలాంటి పరీక్షలు ఉచితంగా చేయించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మరిన్ని వివరాల కోసం టీబీ వైద్యాధికారి లేదా పర్యవేక్షకులను సంప్రదించాలని కోరారు. టీబీ పర్యవేక్షకులు నాగి రెడ్డి, ఏఎన్ఎంలు మాధవి, రమాదేవి, రాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై తక్షణం స్పందించాలి

- ఎంపీడీవో హరినారాయణ



మాట్లాడుతున్న ఎంపీడీవో హరినారాయణ

ములకలచెరువు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యలపై తక్షణం స్పందించాలని ఎంపీడీవో హరినారాయణ ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. తాగునీటి సమస్య నెలకొన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నామన్నారు. మే నెలాఖరుకల్లా లే అవుట్‌లలో పక్కా గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. సర్పంచులు రాంబాబునాయుడు, రెడ్డెప్ప మాట్లాడుతూ పనులు చేసిన కూలీలకు ఉపాధి బిల్లులు విడుదల కాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై ఎంపీడీవో హరి నారాయణ మాట్లాడుతూ ఇప్పటికే ఐదు వారాల బిల్లులు జమయ్యాయని, మిగిలిన బిల్లులు మూడు రోజు ల్లోగా జమ అవుతాయన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ సాయిలీల, ఏవో లీలాకుమారి, ఎంఈవో వెంకటరమణ, ట్రాన్స్‌కో ఏఈ రామలక్ష్మణ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ దిలీప్‌కుమార్, కో ఆప్షన్ మేరమ్మ, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, కృష్ణప్ప, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాపేపల్లి నరసింహస్వామి ఆలయంలో కలశ పూజలు



రాజగోపురం వద్ద కలశ పూజలు చేస్తున్న వేదపండితులు

పెద్దమండ్యం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) మండలంలోని పాపేపల్లి నరసింహస్వామి ఆలయంలో మంగళవారం వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఎదుట నిర్మించిన రాజగోపురం, మహాకుంభాభిషేకం పురస్కరించుకొని కలశాలకు పూజలు చేశారు. ఉదయం అగ్ని ప్రతిష్ఠ, అష్టలక్ష్మీ హోమం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బుధవారం కలశారాధన, ప్రాణ ప్రతిష్ఠ హోమం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకరరెడ్డి సతీమణి ఇందిరమ్మ, తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాలు



ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న విద్యుత్ స్తంభాలు తుప్పు పట్టి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నా రు. వర్షాకాలం రానుండడంతో పెను గాలు లకు విద్యుత్ స్తంభాలు కూలిపోయి ప్రమా దం సంభవిస్తే, ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని సంపతి కోట గ్రామంలో పలు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని పలు మార్లు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందంటున్నారు. ఒక్క సంపతి కోట గ్రామ మే కాకుండా మండలంలోని అనేక గ్రామాల్లో పాత విద్యుత్ స్తంభాలు ఎక్కడ చూసినా దర్శనం ఇస్తాయన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే ట్రాన్స్‌కో అధికారులు తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టిడ్కో ఇళ్లను పూర్తి చేయాలి

రాయచోటిటౌన్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన సుండుపల్లె రోడ్డులో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. అనరంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఇళ్లపనులను త్వరగా పూర్తి చేయించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. టిడ్కోలో రోడ్డు పనులు, డ్రైనేజీ, విద్యుత్, నీటి సౌకర్యం వంటి మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో పేదలకు నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదన్నారు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్ల ప్రక్రియ పునరుద్ధరించాలి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

పీలేరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి);అర్థాంతరంగా ఆగిపోయిన ప్రమోషన్ల ప్రకియను వెంటనే ప్రారంభించాలని అన్నమయ్య జిల్లా ఎన్ఎంయూ కార్యదర్శి పి. సుబ్రమణ్యం రాజు కోరారు. మంగళవారం పీలేరు ఆర్టీసీ డీఎం కార్యాలయం వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ఉద్యోగులతొలగింపు, అక్రమ సస్పెన్షన్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, కేవలం అధికారుల నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా రిలే దీక్షలు చేస్తున్నామన్నారు. గ్యారేజ్ కార్మికుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో రీజనల్ ఉపాధ్యక్షురాలు గండికోట ప్రమీల, ఎం. నిర్మల, ఎం.ఎస్. మణ్యం, పీ.వీ.జీ నాయుడు, ఎం. లక్ష్మయ్య, బీ. వీ. ఎన్ నాయక్, పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిపో అధ్యక్షుడు సీ. వీ. రమణ, కార్యదర్శి ఆదినారాయణ, జోనల్, జిల్లా, డిపో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినికొండ గ్రామం సర్వే నెంబరు 682-బిలోని 2.74 ఎకరాలప్రభుత్వ భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదంటూ మంగళ వారం రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ స్థలం చదును పనులను రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. ఉన్నత అధికారులు ఉత్తర్వుల మేరకు ఆ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ భరత్‌రెడ్డి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర చికిత్స శిబిరం ప్రారంభం



కంటిపరీక్షలు చేస్తున్న వైద్యులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీఆర్టీ హైస్కూల్‌లో మంగళవారం చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ మొబైల్ ఐ సర్జికల్ యూనిట్, పుట్టపర్తి టీం , ఏఆర్ఎస్ఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని శంకర నేత్రాలయ యూఎస్ బోర్డు మెంబరు రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరం మే నెల 8వ తేదీ వరకు ఉంటుందని ప్రాజెక్టు కో- ఆర్డినేటర్ భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో పరీక్షలు నిర్వహించిన అనంతరం శుక్లం, కంటి పొర ఉన్నావారికి ఇక్కడే ఆపరేషన్ నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తామన్నారు. మదనపల్లె పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీటీ కళాశాల మాజీ కరస్పాండెంట్ వైఎస్ మునిరత్నం, జీఆర్టీ హైస్కూల్ హెచ్ఎం జగన్మోహన్, రామచంద్ర, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ, నారాయణరెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు, చిన్న, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ పూర్తి చేయాలి



వీఆర్‌వోలు, డీలర్లకు సూచనలిస్తున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తెలుపు రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ చేయించ డంలో అందరు భాగస్వాములు కావాలని తహసీల్దార్ ధనంజయులు ఆదేశించారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్ సమావేశ భవనంలో మదనపల్లె నియోజకర్గంలోని మూడు మండలాల వీఆర్‌వోలు, చౌకదుకాణ డీలర్లు, ఎండీయూ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 1,94,525 తెలుపు రేషన్‌కారు దారులున్నారని, వీరిలో ఇప్పటి వరకు 1,74,400 మందికి ఈకేవైసీ పూర్తయిందన్నారు. మిగిలిన వారిలో 0-5 ఏళ్ల లోపు వారికి, 80 ఏళ్లు పైబడ్డ వారికి ఈకేవైసీ చేయనవసరం లేదన్నారు. మిగిలిన 15,848 మందికి ఈకేవైసీ చేయించాలన్నారు. ముఖ్యంగా వీఆర్‌వోలు, డీలర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఈకేవైసీ చేయించాలన్నారు. సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ ఎన్.ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎండీయూ ఆపరేటర్లే ఈకేవైసీ చేయించడంలో ముందున్నారని, ఇకమీదట డీలర్లతో కలసి వీఆర్‌వోలు, సచివాలయ వీఆర్‌వోలు ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు.

'పిఠాపురం ఘటనపై పవన్ కళ్యాణ్ స్పందించాలి'



సీఐకి వినతి పత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నేతలు

పీలేరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎస్సీల సంఘ బహిష్కరణ సంఘటనపై పిఠాపురం ఎమ్మెల్యే, ఉప-ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఎస్సీలను సంఘ బహిష్కరణ చేసిన అగ్రకులాల పెత్తందారులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం మేరకు కేసు నమోదు చేయాలని మంగళవారం పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తుమ్మల ధరణీ కుమార్, సీపీఐ నాయకులు టీఎల్ వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుబ్బా శ్రీకాంత్, అఖిల భారత బంజారా సేవా సంఘం నాయకులు మూడే హరినాయక్ మాట్లాడు తూ స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు కావస్తున్నా సంఘ బహిష్కరణ వంటి దురాచారాలు కొనసాగుతుండడం రాజ్యాంగానికి, ప్రభుత్వానికి అవమానకరమన్నారు. మల్లాం గ్రామ ఘటనను రాష్ట్రంలోని ఎస్సీలందరూ ఖండిస్తున్నారన్నారు. సంఘ బహిష్కరణ అమలు చేసిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు చేపట్టి భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఆ గ్రామంలో విద్యుదాఘాతం కారణంగా మరణించిన యువకుడి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోదేషావలి, నాయకులు ఇబ్రహీం, బావాజీ, మౌలా, ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, మాలమహానాడు నాయకులు ద్వారకనాథ్, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు

బాల్య వివాహాలు నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో నాగవేణి

పెద్దమండ్యం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) బాల్య వివాహాలను సమష్టిగా నివారించాలని తంబళ్లపల్లి సీడీపీవో నాగవేణి పిలుపు నిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసంపై మండల అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో నాగవేణి మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం కిశోర బాలికల చైతన్య కార్యక్రమాలు చేట్టిందన్నారు. ఈ సందర్భంగా వారిలో విద్య పరిజ్ఞానం, ఆరోగ్య జాగ్రత్తలు, వెలుగు సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తారన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం, మహిళలే పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దుతారన్న అంశంపై కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎంఈవో మనోహర్, ఏపీఎం నరసింహులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నౌజియాబేగం, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్ అహ్మద్

పెద్దమండ్యం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) తాగునీటి సమస్య పరిష్కరించాలని మండలంలోని సి. గొల్లపల్లి గ్రామ పంచాయతీ రెక్కలకొండ దళితవాడ ప్రజలు అధికారులకు కోరారు. మంగళవారం దళితవాడలో ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ దళితవాడలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యపై ఎంపీడీవో శ్రీధర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం చర్యలు చేపడతామని ఫోన్‌ద్వారా తెలిపారు. దళితుల భూసమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. సి.గొల్లపల్లి వీఆర్‌వో అంజినేయులునాయక్, మాజీ సర్పంచ్ నాగార్జున పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

రామాపురం,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు మంగళవారం నీలకంఠ్రావుపేట ఉప సర్పంచ్ ఎస్. మహబూబ్‌బాషా ఫీల్డ్ అసిస్టెంట్ పెంచల్‌రెడ్డితో కలిసి మజ్జిగ ప్యాకె ట్లు పంపిణీ చేశారు. కూలీలు ఉపసర్పంచ్ మహబూబ్‌బాషాకు, పెంచల్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.